VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K. U.S.A., New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
:91(40) 27628184, 27674037
:victoria.ashoknagar@gmail.com
://www.victoriaoverseas.com

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 263, పేజీలు - 08
బుధవారం, మార్చి 11, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

మూసీలో నిత్యం మంచినీటి ప్రవాహం

- గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ డీపీఆర్ రెడీ - 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర నడిబొడ్డున ప్రవహించే మూసీ నదిని అందంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మురుగు, వ్యర్థాలతో ప్రవహిస్తున్న మూసీ నదిని ప్రపంచ స్థాయి పర్యాటక, ఆర్థిక కేంద్రంగా మార్చటమే లక్ష్యంగా సర్కార్ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపట్టింది.

ఈ చర్యలో భాగంగా బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌ను సైతం చేపడుతోంది. ఈ మేరకు తాజాగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎంఆర్ఎల్డిసిఎల్) డీపీఆర్‌ను సిద్ధం చేసింది. బాపూఘాట్ వద్ద 150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం నిర్మాణం కానుంది. మూసీ నదికి రెండు వైపులా విశాలమైన రోడ్లు, నది పొడవునా ఆకట్టుకునే పార్కులు ఏర్పాటు కానున్నాయి. బాపూఘాట్ వద్ద ప్రభుత్వానికి 60 ఎకరాల భూమి భూమి ఉంది. ఇందులో 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో గాంధీ సరోవర్ ప్రాజెక్టు రాబోతుంది. 100 మీటర్ల ఎత్తు వరకు పలు అంతస్తుల్లో టవర్ కట్టి అందులో సమావేశ గదులు, మ్యూజియం, గాంధీ చరిత్రపై ప్రదర్శనశాల, కార్యాలయాలు ఏర్పాటు చేస్తారు. ఈ టవర్‌పై 35-50 మీటర్ల ఎత్తున గాంధీ విగ్రహం కొలువుదీరనుంది. గాంధీ విగ్రహం వెనుక లండన్ థేమ్స్ నది ఒడ్డున కనిపించే 'లండన్ ఐ'ను పోలిన రంగుల రాట్నం ఏర్పాటు చేయనున్నారు. గాంధీ స్మృతుల్లో ఒకటైన చరఖాను తలపించేలా ఈ నిర్మాణం కనిపించనుంది. పక్కనున్న 98 ఎకరాల డిఫెన్స్ భూములను సేకరించే ప్రక్రియ ప్రస్తుతం పురోగతిలో ఉందని అధికారులు చెబుతున్నారు. మూసీలో నిత్యం మంచినీటిని ప్రవహింపజేయడంతోపాటుగా నదికి రెండు వైపులా ఉన్న పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల నుంచి గాంధీ సరోవర్ వరకు మట్టత్తంగా 15 వంతెనలు నిర్మిస్తారు. ఒకవైపు 100 అడుగుల రోడ్డు, మరోవైపు 80 అడుగుల రోడ్డు నిర్మించనున్నారు. దాంతో పాటుగా కాలిబాట, సైక్లింగ్ ట్రాక్, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తారు. నదిలో పూడికను తొలగించి, అంచులను సరిచేసి కొన్ని ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేస్తారు. పిల్లల పార్కులు, హోటళ్లు, వేడుకలు నిర్వహించుకునేలా యాంఫీ థియేటర్లు ప్రాజెక్టులో భాగం కానున్నాయి. మూడు, నాలుగు చోట్ల చిన్నపాటి ఆనకట్టలనూ కూడా నిర్మిస్తారు. గాంధీ సరోవర్‌లో బోటింగ్ సదుపాయం కూడా ఉండనుంది.

ఢిల్లీలో నీతులు తెలంగాణలో అడ్డగోలుగా రాజ్యాంగ ఉల్లంఘన
- మాజీమంత్రి హరీశ్ రావు డిమాండ్

2లో..

ఇరాన్, అమెరికా యుద్ధంతో గ్యాస్ కొరత
- మెనులో వంటకాలు తగ్గించిన హోటల్స్

2లో..

కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు
- రూ.8.80 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఓవైపు ఇరాన్, ఇజ్రాయెల్- అమెరికా మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలతో పాటు భారత్ కూడా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కు కొరత రాకుండా పలు నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికే చమురు శుద్ధి సంస్థలపై ప్రభుత్వం నిత్యావసర సరకుల చట్టం-1955 ను ప్రయోగించింది. అలాగే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని ప్రస్తుతం ఉన్న 21 రోజుల నుండి 25 రోజులకు పెంచింది. గ్యాస్ సిలిండర్ల బ్లాక్ విక్రయాను అరికట్టేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇక మరోవైపు ఐదు రాష్ట్రాల ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర కేబినెట్ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో తాజాగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు దాదాపు రూ.8.80 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

2లో..

తెలుగు వైభవాన్ని చాటేలా అమరావతి

- సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్న సీఎం చంద్రబాబు

అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగు వైభవాన్ని ప్రపంచానికి చాటేలా భావితరాలకు అందించేలా అమరావతిని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాజధానిలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను చేపట్టేలా అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 59వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధానిలోని వివిధ సంస్థలకు జరపాల్సిన భూ కేటాయింపులు, సెక్రటేరియేట్, హెచ్వోడీ భవనాల్లో కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సీఆర్డీఏ నుంచి వచ్చిన వివిధ ప్రతిపాదనలను సీఆర్డీఏ అథార్టీ సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాజధాని పరిధిలోని నీరుకొండ వద్ద చేపట్టే టూరిజం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి. మొత్తంగా 167 ఎకరాల విస్తీర్ణంలో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు తెలుగు వైభవాన్ని చాటేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. ఈ ప్రాజెక్టులో వాటర్ ఫ్రంట్, కల్చరల్ సెంటర్ తదితర విభాగాలు

2లో..

అప్పుల సుడిగుండంలో ఆరు గ్యారంటీల పయనం!

- రేవంత్, భట్టి జోడి మ్యాజిక్ చేస్తారా.?

(గౌటీ బాల సాయి తిలక్ - ప్రశ్న న్యూస్)

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు కేవలం అంకెల గారడీగా కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ రణక్షేత్రంగా మారబోతున్నాయి. ఒకవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శ్వేతపత్రం డిమాండ్‌తో సర్కారును కార్నర్ చేస్తుంటే, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ అప్పుల చిట్టాను విప్పుతూ ఎదురుదాడికి దిగుతున్నారు. సుమారు 3 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతున్న వేళ, రాష్ట్ర ఖజానా అసలు స్థితిగతులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సంక్షేమం స అభివృద్ధి మధ్య సమతూకం పాటించడం ఇప్పుడు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కత్తిమీద సాములా మారింది.

అప్పుల కుప్ప.. వడ్డీల తిప్ప

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబి వేధిస్తోంది. గత పదేళ్లలో అప్పులు రూ.7.5 లక్షల కోట్లకు చేరాయని ముఖ్యమంత్రి ఆరోపిస్తుండగా, అధికారిక లెక్కలు భిన్నంగా ఉన్నాయి. అయితే, ఏ లెక్క చూసినా నెలకు వేల కోట్ల రూపాయలు కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోంది. ఈ డెట్ ట్రాప్ నుంచి బయటపడి, కొత్త ప్రాజెక్టులకు నిధులు మళ్లించడం ప్రభుత్వానికి అతిపెద్ద సవాలు. అప్పు తెచ్చి పప్పు కూడు అన్నట్లుగా కాకుండా, ఆదాయ వనరులను పెంచుకోవడమే ఏకైక మార్గమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గ్యారంటీల భారం.. ఖజానాకు గండం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు బడ్జెట్‌లో సింహభాగాన్ని ఆక్రమించనున్నాయి. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి పథకాల అమలుకు ఏటా రూ. 56,000 కోట్ల పైచిలుకు నిధులు అవసరమని అంచనా. ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం, ఈ నిధుల కోసం ఇతర శాఖల కేటాయింపుల్లో కోత విధిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూనే, మౌలిక సదుపాయాలను విస్మరించకూడదనే ఒత్తిడి సర్కారుపై ఉంది.

పెట్టుబడి వ్యయంపై విమర్శలు

రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడి వ్యయం విషయంలో ప్రభుత్వం కొంత వెనుకబడి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బడ్జెట్‌లో రూ. 36,000 కోట్లు కేటాయించినా, క్షేత్రస్థాయిలో ఖర్చు ఎంత అన్నదే కీలకం. జీతాలు, పెన్షన్లు వంటి రెవెన్యూ వ్యయం భారంగా మారుతున్న తరుణంలో, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి ఆస్తుల సృష్టికి నిధులు తగ్గిస్తే దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. సంక్షేమంతో పాటు సంపద సృష్టిని కూడా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆదాయ మార్గాలు - ట్రిలియన్ డాలర్ల కల

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం నెరవేరాలంటే, ఆదాయ మార్గాలను గణనీయంగా పెంచుకోవాలి. అటవీ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటా, గ్రాంట్లపై రాష్ట్రం ఆశలు పెట్టుకుంది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే నిధులు రాబట్టుకోవడం రాజకీయంగానూ, ఆర్థికంగానూ ఇప్పుడు అనివార్యం. ఈ బడ్జెట్ సమావేశాలు తెలంగాణ ఆర్థిక దిశను నిర్దేశించనున్నాయి. కిషన్ రెడ్డి డిమాండ్ చేసినట్లుగా ప్రభుత్వం పారదర్శకంగా వివరాలు వెల్లడిస్తుందా? లేక రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతుందా అన్నది చూడాలి. సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచుతూనే, ఆర్థిక క్రమశిక్షణను పాటించడమే రేవంత్ సర్కార్ ముందున్న అసలైన పరీక్ష.

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు
- కేబినెట్ సబ్ కమిటీ కీలక సమావేశం

- 'తెలంగాణ బ్రాండ్' ప్రతిబింబించేలా ప్రతిష్టాత్మక ఏర్పాట్లు
- జూన్ 26 నుంచి జూలై 27 వరకు పుష్కరాలు
- పుష్కరాల ఏర్పాట్లలో రాజీపడే ప్రసక్తేలేదు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గోదావరి నదీ పుష్కరాల కోసం తెలంగాణ ప్రభుత్వం కసరత్తులు ముమ్మరం చేస్తోంది. వచ్చే ఏడాది జూన్ 26వ తేదీన ప్రారంభమై జూలై 7వ తేదీతో ముగియనున్న గోదావరి పుష్కరాల కోసం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు కాగా తాజాగా హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రుల సమావేశం జరిగింది. కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్‌గా

2లో..

'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న సీఎం చంద్రబాబు

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఏపీ - టీఎస్ఎంఎం)' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ

2లో..

నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి.?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బండి సంజయ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాగునీటి కాలువ పనుల కోసం ఆందోళన బాట పట్టిన రైతులను పోలీసులు అరెస్టు చేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. తమ పొలాలకు నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలాలకు సాగునీరు అందించే 11వ ప్యాకేజీ (ఎల్ఎం 4, ఎల్ఎం 6) కాలువ పనులను తక్షణమే పూర్తి

2లో..

ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్
- ప్రభాకర్ రావుకు అరెస్ట్ నుంచి మినహాయింపునిచ్చిన సుప్రీంకోర్టు
- సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేయవద్దని షరతు
- కోర్టు అనుమతి లేకుండా రాష్ట్రం, దేశం విడిచి వెళ్లకూడదని కండిషన్

న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజుకో మలుపు చోటు చేసుకుంటోంది. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికే స్పెషల్

2లో..

నూతన గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి ఘన స్వాగతం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా మంగళవారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతోపాటు పలువురు ఉన్నతాధికారులను ఆయనకు సీఎం పరిచయం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల గవర్నర్‌లను కేంద్రం ఇటీవల

2లో..

ఢిల్లీలో నీతులు తెలంగాణలో

అడ్డగోలుగా రాజ్యాంగ ఉల్లంఘన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఢిల్లీలో రాజ్యాంగం గురించి గొప్పలు చెబుతూ రాష్ట్రాల్లో మాత్రం అదే రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్ పార్టీ తీరును మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు తప్పుపట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరడం, అగౌరవపరచడంలో కాంగ్రెస్, బీజేపీలు ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలన్నారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పోస్టును ఏడేళ్లుగా ఖాళీగా ఉంచడాన్ని రాజ్యాంగ శూన్యత అని పీఏసీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన చెప్పిన మాటలు నిజమే కావచ్చు, కానీ అదే సూత్రం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వర్తించదా అని హరీశ్ రావు ప్రశ్నించారు.

డిప్యూటీ స్పీకర్ పదవిని ఎందుకు భర్తీ చేయడం లేదు?

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నరేళ్లు కావస్తున్నా అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ పోస్టును ఎందుకు భర్తీ చేయడం లేదని మాజీమంత్రి హరీశ్ రావు నిలదీశారు. ఢిల్లీలో రాజ్యాంగం గురించి గొంతు చించుకునే కేసీ వేణుగోపాల్, రాహుల్ గాంధీలు తెలంగాణలో జరుగుతున్న రాజ్యాంగ ఉల్లంఘనపై ఏం సమాధానం చెబుతారు, ఇది రాజ్యాంగ శూన్యత కాదా అని ప్రశ్నించారు. రాజ్యాంగ విలువల గురించి ఢిల్లీలో నీతులు చెప్పే కాంగ్రెస్, తన రాజకీయ అవసరాల కోసం రాష్ట్రాల్లో వ్యవస్థలను ఖూనీ చేస్తోందని హరీశ్ రావు మండిపడ్డారు. బీజేపీ అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలనే కాంగ్రెస్ కూడా తెలంగాణలో రిపీట్ చేస్తోందని, ఈ రెండు పార్టీలు ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడంలో పోటీ పడుతున్నాయని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు.

రాజ్యాంగబద్ధమైన పదవులను భర్తీ చేయడం లేదు

తమకు అనుకూలంగా ఉన్నప్పుడు ఒక మాట లేనప్పుడు మరో మాట మాట్లాడటం కాంగ్రెస్ నైజమన్న హరీశ్ రావు, ఈ దొంగ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అధికార దాహంతో ఈ రెండు పార్టీలు రాజ్యాంగాన్ని అగౌరవపరచడం అత్యంత సిగ్గుచేటన్నారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, రాజ్యాంగబద్ధమైన పదవులను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

ఇరాన్, అమెరికా యుద్ధంతో గ్యాస్ కొరత

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్ కొరత ఏర్పడి బెంగళూరు, ముంబై, ఢిల్లీ, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో హోటళ్లు తాత్కాలికంగా మూతపడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్ల సరఫరా చాలా వరకు తగ్గిపోయింది. దీంతో ఆయా నగరాల్లో రెస్టారెంట్లు, హోటళ్లు మూతపడుతున్నాయి. సిలిండర్ల కొరత కారణంగా హోటల్స్, రెస్టారెంట్ల యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. గ్యాస్ ఎక్కువగా అవసరమయ్యే ఫలహారాలను తమ మెనూ జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఉదాహరణకు దోశ, మైసూర్ బజ్జీ, వడ వంటి వాటిని మెనూ నుంచి తొలగిస్తున్నారు. వాటికి బదులు శాండ్ విచ్ వంటి ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఓవెన్‌తో అందించే ఫలహారాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా మెనూలో మార్పులు చేస్తున్నామని హోటల్స్, రెస్టారెంట్ల యజమానులు చెబుతున్నారు. దోశ, వడ వంటి పదార్థాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. అధిక గ్యాస్ వినియోగమయ్యే ఫలహారాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు

ఈ వివరాలను వెల్లడించారు.'జల్ జీవన్ మిషన్ 2.0'ను 2028 డిసెంబర్ వరకు పొడిగించారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ. 8.7 లక్షల కోట్లను కేటాయించింది. ఈ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటికే 81 శాతం గ్రామీణ గృహాలకు కుళాయి కనెక్షన్లు అందాయి. రెండో దశలో భాగంగా మిగిలిన ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం, అలాగే మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారించనున్నారు. అలాగే తమిళనాడులోని మదురై విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ఎయిర్ పోర్టుగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల మీనాక్షి అమ్మన్ ఆలయం, రామేశ్వరం పుణ్యక్షేత్రాలకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని కేంద్రం భావించింది. దాంతోపాటు రైల్వేలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 4,474 కోట్ల వ్యయంతో రెండు ప్రధాన రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇక మధ్యప్రదేశ్ లో కొత్తగా 4 లేన్ కారిడార్ నిర్మాణానికి సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇవే కాకుండా ఎన్నికల నేపథ్యంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పీఎం ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

తెలుగు వైభవాన్ని చాటేలా అమరావతి

వస్తాయి అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్

'పర్యాటకంతో పాటు నిత్యం రకరకాల కార్యక్రమాలు నిర్వహించుకునే వాతావరణం ఉండేలా చూడాలి. హోటళ్లను ఏర్పాటు చేయాలి, అమ్యూజ్మెంట్ పార్కులను అభివృద్ధి చేయాలి. అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా ఆ ప్రాంతాన్ని డిజైన్ చేయాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

'నీరుకొండలో చేపట్టే బోయే ప్రాజెక్టును అత్యంత సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దాలి. భవిష్యత్తులో క్రీడా రంగం అతి పెద్ద ఆదాయ వనరు కాబోతోంది. దీనికి బీసీసీఐ, ఐసీసీ సంస్థలే అతి పెద్ద ఉదాహరణ. ఒకప్పుడు నిధుల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి ఇప్పుడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా క్రికెట్ బోర్డులు ఎదిగాయి. ఇదే విధంగా మరికొన్ని క్రీడలు కూడా కమర్షియలుగా టర్న్ అవుతాయి. ఇలాంటి వాటిని అందిపుచ్చుకోవాలి. అమరావతిలోని స్పోర్ట్స్ సిటీకి సంబంధించిన మాస్టర్ ప్లాన్ ఇదే విధంగా రూపొందించాం'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

అమరావతిలోకి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను తీసుకురావాలి

'అమరావతిలోకి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులను తీసుకురావాలి. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఇలాంటి వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 'ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సైబర్ సిటీలో పెట్టుబడులు పెట్టలేకపోయినందుకు డీఎల్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పుడు చింతిస్తున్నాయి. ఈసారి అమరావతిలో అలాంటి అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తున్నాయి. ఇది మన ప్రభుత్వానికి ఉన్న క్రెడిబులిటీ. ఈ బ్రాండ్ మరింతగా పెరగాలి. అందుకే పెట్టుబడులు పెట్టే వారిని రెగ్యులరుగా ఫాలో అప్ చేస్తూనే ఉండాలి.

ఓవైపు రాజధానిలో పనులను త్వరితగతిన చేపట్టేలా పర్యవేక్షణ చేస్తూనే పెట్టుబడులు పెట్టే సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉండాలి. అమరావతిలో నిర్మించబోతున్న తెలుగు కల్చరల్ సెంటర్ కు మంచి పేరును పరిశీలించండి. రాజధానిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయండి. ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఓ పెద్ద కన్వెన్షన్ సెంటర్ నిర్మించాల్సిన అవసరం ఉంది'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏడీసీ అధికారులు పాల్గొన్నారు.

నీళ్లివ్వమని అడిగిన రైతులను జైల్లో పెట్టడం ఏమిటి.?

చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కాలువ పనుల కోసం రూ. 3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా, ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంపై బండి సంజయ్ విస్మయం వ్యక్తం చేశారు. ఈ పనులు గనుక పూర్తయి ఉంటే దాదాపు 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన అన్నారు. గత పదేళ్లు అధికారంలో ఉండి కూడా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ ఒక 'రైతు ద్రోహి' అని ఆయన ఘాటుగా విమర్శించారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వైఫల్యాల వల్లే రైతులు పంటలు నష్టపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు మద్దతుగా నిలిచిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి సహా ఇతర నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. రైతులపై అక్రమ కేసులు నమోదు చేస్తే ఊరుకునేది లేదని, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని హెచ్చరించారు. రైతుల డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీ అండగా ఉంటుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి కాలువ పనులు ప్రారంభించకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

ఉన్న మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.మరీ ముఖ్యంగా గోదావరి నదిపై ఉన్న పుష్కర ఘాట్లను అభివృద్ధి చేయడం పుష్కర ఘాట్లకు వెళ్లే రోడ్లు వేయడం, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకోవాల్సిన అవసరాన్ని మంత్రులు ప్రస్తావించారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. మంత్రులతో చర్చించి గోదావరి నది ప్రాంత సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు ఛైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేశారని తెలిపారు.ఇక ఈ గోదావరి పుష్కర ఏర్పాట్లలో రోడ్లు భవనాలు శాఖ కీలక భూమిక పోషించనుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆధ్యాత్మికతకు, టెంపుల్ టూరిజానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని వివరించారు. గోదావరి నది మహారాష్ట్రలో పుట్టినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రంలోనే అధికంగా నది పరివాహకం ఉంటుందని వెల్లడించారు. 26-6-2027న గోదావరి పుష్కరాలు మొదలై 7-7-2027 వరకు కొనసాగుతాయని అన్ని శాఖలు, విభాగాలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.గోదావరి నది నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద తెలంగాణలోకి అడుగుపెట్టి భద్రాచలం వరకు ప్రవహిస్తుంది. ఈ వందల కిలోమీటర్ల మేర గోదావరి నది ప్రవహిస్తూ బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, భద్రాచలం వంటి ఎంతో చరిత్ర కలిగిన ఆలయాలు, ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాల మీదుగా పయనిస్తుంది. ఇక కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరించే పవిత్రనది గోదావరి కాగా దీన్ని తెలంగాణ గంగా నదిగా పిలుస్తారు. ఈ నేపథ్యంలోనే గోదావరి పుష్కరాలకు అంతే స్థాయిలో నిర్వహించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు. పుష్కరాలకు భక్తులు మరింత సౌకర్యవంతంగా చేరుకునేలా రోడ్లు, భవనాలు శాఖ అన్ని రకాల ప్లాన్లను రెడీ చేస్తోంది.హ్యామ్ మోడల్ రోడ్ల కనెక్టివిటీతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కాంక్రీట్ రోడ్లు, పుష్కర ఘాట్లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తుందని మంత్రులు వివరించారు. గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని మంత్రులు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన పుష్కర ఘాట్లు, ఘాట్లకు వెళ్లేందుకు రోడ్లు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. మరీ ముఖ్యంగా కోట్లలో వచ్చే భక్తులతో రద్దీ ఏర్పడుతుందని అందుకే వాహనాల రాకపోకలు, ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌పై దృష్టి పెట్టాలని మంత్రులు పేర్కొన్నారు. ఈ వాహనాలు, పార్కింగ్‌కు సంబంధించి అన్ని శాఖల అధికారులు, పోలీసులు సమన్వయంతో ఒక రూట్ మ్యాప్ రెడీ చేయాలని మంత్రులు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్

ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారిని విదేశాల నుంచి రప్పించిన సిట్ అధికారుశ్రీ వారిపై అనేక కేసులు పెట్టి నిందితుల జాబితాలో చేర్చారు. అయితే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ జరుగుతుండగానే కీలక పరిణామం చోటుచేసుకుంది.మాజీ ఐపీఎస్ అధికారి గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్ రావుకు బిగ్ రిలీఫ్ లభించింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును అరెస్ట్ చేయకుండా సుప్రీంకోర్టు తాజాగా ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ప్రభాకర్ రావుకు అరెస్ట్ నుంచి మినహాయింపు కల్పిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు చేస్తున్న దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావుకు సూచించింది. దీంతో ఈ కేసులో ప్రభాకర్ రావుకు అరెస్ట్ భయం నుంచి విముక్తి లభించనుంది.ఇక ఈ కేసులో సాక్ష్యాలను గానీ ఆధారాలను గానీ ట్యాంపర్ చేసినా, చేసేందుకు ప్రయత్నించినా తాము మంజూరు చేసిన ముందస్తు బెయిల్ రద్దు అవుతుందని ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. అదే సమయంలో సుప్రీంకోర్టు అనుమతి లేకుండా తెలంగాణ, దేశం దాటేందుకు వీలు లేదని ప్రభాకర్ రావుకు సూచించింది. ఈ కేసులో సాక్షులుగా ఉన్న వారిని ప్రభావితం చేసినా బెయిల్ రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు పర్మిషన్ లేకుండా ఎక్కడికీ వెళ్లకూడదని ప్రభాకర్ రావుకు తెలిపింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో గత ప్రభుత్వంలో పోలీస్ ఉన్నతాధికారులుగా పనిచేసిన కొందరిపై సిట్ అధికారులు కేసులు నమోదు చేశారు. అందులో ప్రభాకర్ రావుతోపాటు ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, తిరుపతన్న ఉన్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించిన ప్రభాకర్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసులో పలు సంచలన ఆరోపణలను సిట్ అధికారులు మోపారు.

నూతన గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి ఘన స్వాగతం

బదిలీ చేసింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయ్యారు. జిష్ణుదేవ్ వర్మ స్థానంలో తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ఇటీవల వరకు హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా ఉన్నారు. తాజాగా ఆయనను తెలంగాణ గవర్నర్‌గా కేంద్రం నియమించింది. దీంతో శివ ప్రతాప్ శుక్లా దంపతులు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ధ్యానంతో మానసిక, శారీరక సమస్యలు దూరం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఈరోజుల్లో చాలామంది ప్రజలు అనేక రకాలైన వ్యాధుల బారిన పడుతున్నారు. షుగర్ వ్యాధి, బిపి, థైరాయిడ్ లాంటివి సర్వసాధారణం అయిపోయాయి. ఎన్నో రకాల మెడిసిన్స్ వాడుతున్నారు. ఈ మెడిసిన్స్ వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ తో మరో కొత్త వ్యాధిని కొనితెచ్చుకుంటున్నారు. దత్తాత్రేయ స్వామి ఉపాసకులు శ్రీశ్రీశ్రీ దత్తావధూత కాలేజీ స్వామి శిష్యుడు అయినటువంటి మా గురువు శ్రీశ్రీశ్రీ నిత్యానంద సరస్వతి బాబా మహరాజు ఈ ఆరోగ్య సమస్యలకు ఎటువంటి మెడిసిన్ వాడకుండా వ్యాధిని పూర్తిగా నయం చేసుకునే మార్గాన్ని మీకు చూపించబోతున్నారు. ఎంతోమంది ప్రజల మానసిక, శారీరక సమస్యలను దూరం చేసి మన ముందుకు ఎన్నో వ్యాధులకు పరిష్కారంగా వచ్చారు. ఆయన సలహాలు సూచనలు తూచా తప్పకుండా పాటిస్తూ, 41 రోజుల్లో సంపూర్ణ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పొందగలరు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఆ మహాభాగ్యాన్ని మీరందరూ పొందాలని, ప్రపంచమంతా ఆరోగ్యవంతులుగా మార్చాలని ఆ సంకల్పానికి మీ సహకారం అందించాలని కోరుకుంటున్నాము. మీకు ఎటువంటి వ్యాధులు ఉన్న వాటికి పరిష్కారాన్ని చూపగలము. మీరందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు అవ్వాలని ఆశీర్వదిస్తున్నాము. ఆ దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ మీపై కలుగుగాక. సర్వే జన సుఖినోభవంతు సమస్త లోకాన్ సన్మంగళంభవంతు శ్రీ శ్రీ శ్రీ నిత్యానంద సరస్వతి బాబా మహారాజ్(7989099548)

జగన్ ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం

- గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు

ప్రకటనల ద్వారా సాక్షి సంక్షేమం కోసం వందల కోట్ల లబ్ధి చేకూర్చాడు

జగన్ చేసిన అప్పులతో ప్రభుత్వానికి

ఏటా రూ.71,800 కోట్ల భారం పడుతుంది

జగన్ ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం

మంగళగిరి (ప్రశ్న న్యూస్)సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడమే పనిగా జగన్ ఐదేళ్ల రాష్ట్రాన్ని పరిపాలించాడని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి విమర్శించారు. సిమెంట్ లో భారతి సిమెంట్‌కు ప్రకటనల ద్వారా సాక్షికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పని చేశాడని ఆరోపించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయం, మంగళగిరిలో మాట్లాడిన ఆయన. భారతీ సిమెంట్ కు లబ్ధి చేకూరే విధంగా సిమెంట్ ధర రూ.3 పెంచి సుమారు రూ.165 కోట్లు ప్రజలపై భారం వేశాడని మండిపడ్డారు. దీంతో భారతీ సిమెంట్ సామర్థ్యం మూడు రెట్లు పెరిగిందన్నారు. జగన్ అసెంబ్లీకి రాకుండా ఇంట్లో ఉంటూ రాష్ట్ర ఆర్థిక రంగంపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన అన్ని అవకాశాలను జగన్ వదిలి వేసి ఇవాళ ప్రభుత్వంపై ఒకటే పనిగా బురద జల్లే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు.

జగన్ ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యం

చంద్రబాబు నాయుడు నాయకత్వానికి ఇవాళ రాష్ట్ర ప్రజలు 164 సీట్లు అప్పగించారు. ఆ నమ్మకంతోనే కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోంది. వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో సుమారు 9.70లక్షల కోట్లు అప్పు చేశారు. ఆ అప్పు కూటమి ప్రభుత్వం చేసినట్లు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 81వేల కోట్లు ప్రభుత్వం అప్పు తీసుకుందని కాగ్ నివేదిక ఇస్తే.. వైసీపీ రూ.87 వేల కోట్లుగా ప్రచారం చేస్తుంది. ఆ ఏడాదిలో వైసీపీ మూడేళ్లు అధికారంలో ఉంది. తొలి మూడు నెలల్లో రూ.27,025కోట్లు అప్పు చేసింది. ఐదేళ్లు బటన్ నొక్కడమే పనిగా జగన్ పని చేశాడు. ఆదాయ వనరులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు అని తెలిపారు.

ఉండవల్లిలో నల్లమట్టి మాఫియా దారుణం

- లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

ఉండవల్లి(ప్రశ్న న్యూస్)రాజధాని ప్రాంతమైన ఉండవల్లిలో నల్లమట్టి మాఫియా ఆగడాలు పరాకాష్టకు చేరాయి. నిబంధనలకు విరుద్ధంగా, అతివేగంతో దూసుకెళ్తున్న మట్టి లారీల వల్ల సామాన్యుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. తాజాగా సాయిబాబా గుడి సమీపంలో వేగంగా వచ్చిన ఓ నల్లమట్టి లారీ ఢీకొట్టడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మరణించింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని, ఆగ్రహాన్ని నింపింది.గ్రామస్తులు తమ గోడును వెళ్లబోసుకుంటూ.. ప్రతిరోజూ మృత్యువుతో పోరాటం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నల్ల మట్టి మాఫియా లారీలు సమయం, సందర్భం లేకుండా 24 గంటల పాటు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. లారీల వేగం చూస్తుంటే రోడ్డు మీదకు రావాలంటేనే భయమేస్తుందని, ఎప్పుడు ఏ లారీ ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.లారీల నుండి పడుతున్న మట్టి వల్ల రోడ్లన్నీ దుమ్ముమయంగా మారుతున్నాయని, దీనివల్ల శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తుతున్నాయని నిరసన వ్యక్తం చేస్తున్నారు పోలీసులు రాజధాని గ్రామాల పరిధి దాటి వెళ్లకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసినప్పటికీ, మాఫియా ఏమాత్రం తగ్గడం లేదు. పోలీసుల కళ్లు గప్పి నులకపేట మీదుగా బ్రహ్మానందపురం గుండా దొంగ చాటుగా మట్టి రవాణా సాగిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో ఇళ్ల మధ్య మట్టిని అన్‌లోడ్ చేస్తూ స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు."మా ప్రాణాలు రక్షించండి! అధికారుల అలసత్వం వల్ల ఇంకెంత మంది బలి కావాలి?" అంటూ ఉండవల్లి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వెంటనే అధికారులు స్పందించి ఈ నల్లమట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, నివాస ప్రాంతాల్లో లారీల రాకపోకలను నియంత్రించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ సిబ్బంది

జవహర్ నగర్ (ప్రశ్న న్యూస్) జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక వివరాల ప్రకారం కీసర సర్కిల్ పరిధిలోగల జవహర్ నగర్ ప్రాంతానికి చెందిన అంబేద్కర్ నగర్ ప్రధాన రహదారి మిలీనియం స్కూల్ వద్ద మున్సిపల్ సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా రోడ్డు పక్కన పనిచేస్తూ ఉండగా అంబేద్కర్ నగర్ నుండి చెన్నాపూర్ వైపు వెళ్లే ఒక కారు హఠాత్తుగా మున్సిపల్ సిబ్బంది పైకి దూసుకు వెళ్లిందని స్థానికులు తెలిపారు. ఈ దుర్ఘటనలో ప్రమాదానికి గురైన మున్సిపల్ కార్మికులు రవి, ప్రదీప్ లను హుటాహుటిన 108 అంబులెన్స్ సహకారంతో ఈసీఐఎల్ లో గల రాఘవేంద్ర హాస్పిటల్ కు తరలించి హాస్పిటల్లో అడ్మిట్ చేయడంతో హాస్పిటల్ వైద్యాధికారులు చికిత్స ప్రారంభించారని ఈ ప్రమాదానికి గురైన రవి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండగా ప్రదీప్ కు తల భాగంలో హానికరమైన దెబ్బ తగిలినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాద విషయాన్ని తెలుసుకున్న గ్రేట్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ అధికారి వసంత ఆదేశానుసారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు హాస్పిటల్ వద్దకు వచ్చి ప్రమాదానికి గురైన బాధితుల వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేసిన డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

మత సామ్రాస్యానికి ప్రతీక రంజాన్ మాసం

కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాఘవేంద్ర గౌడ్

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మేడ్చల్ సర్కిల్‌లో ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలను అందజేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు రంజాన్ కానుకగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ గారు రంజాన్ కానుకలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో సుమారు 1000 మంది ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో పేద మరియు అవసరమైన ముస్లిం కుటుంబాలకు సహాయం చేయడం ఎంతో మంచి కార్యక్రమమని తెలిపారు. రామన్న గారి రాఘవేంద్ర గౌడ్ తమ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయడం అభినందించాల్సిన విషయమని అన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. వివిధ మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించడమే భారతదేశ సంప్రదాయం అని ఆయన పేర్కొన్నారు. ఈ పండుగ అందరికీ శాంతి, సౌభ్రాతృత్వాన్ని తీసుకురావాలని కోరుకున్నారు. అలాగే ఈ పవిత్ర రంజాన్ మాసంలో ఏ ఒక్కరు కూడా బాధపడకూడదు అన్న ఉద్దేశంతో రంజాన్ కానుకలను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రంజాన్ మాసం సందర్భంగా పరస్పర ప్రేమ, సోదరభావం పెంపొందాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ చాపరాజు, మాజీ కౌన్సిలర్ జాకట దేవ, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, జైపాల్ రెడ్డి, ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్, రంజిత్, స్థానిక నాయకులు, యువకులు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి పాలనలో సంక్షేమానికి స్వర్ణయుగం

సంక్షేమం--అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం

మంత్రి డా.డోలా బాలవీరాంజనేయస్వామి

మంగళగిరి (ప్రశ్న న్యూస్)రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమానికి నిజమైన స్వర్ణయుగం ప్రారంభమైందని మంత్రి డా. డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కొద్దిమందికే పరిమితమయ్యాయని, అయితే ప్రస్తుతం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం సంక్షేమాన్ని చేరవేస్తోందని తెలిపారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలన కాలంలో కేవలం 15 శాతం హామీలను మాత్రమే అమలు చేసి మిగతా 85 శాతం హామీలను అమలు చేయకుండా అమలు చేసినట్లు ఊదరగొట్టుకున్నాడు. సంక్షేమం అంటే కేవలం బటన్ నొక్కుడు కార్యక్రమంగా తయారు చేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా రాష్ట్రంలో సుమారు 63 లక్షల మందికి ప్రతి నెలా రూ.2700 కోట్లకు పైగా పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం హామీలను అమలు చేసి సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. అదేవిధంగా దీపం--2 పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకం రాష్ట్ర చరిత్రలోనే అత్యంత పెద్ద సాయంగా నిలిచిందన్నారు. ఈ పథకం ద్వారా సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఇప్పటికే రూ.14 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశామని వెల్లడించారు. దేశంలో రైతులకు ఇంత పెద్ద మొత్తంలో సాయం అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. విద్యారంగంలో కూడా ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోందని మంత్రి చెప్పారు.

15న వర్కింగ్ జర్నలిస్టుల ఉగాది సంబరాలు

- పంచాంగ శ్రవణం, కవిసమ్మేళనం - ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు

- విందుభోజనం.. మహిళలకు చీరలు పంపిణీ

అక్కయ్యపాలెం(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ , ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో ఈనెల 15న (ఆదివారం)వర్కింగ్ జర్నలిస్టుల ఉగాది సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావులు తెలిపారు. ఉగాది పర్వదినం నేపథ్యంలో మంగళవారం అక్కయపాలెం ప్రాంతంలోని ఒక ప్రయివేటు హోటల్ లో ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈనెల 15న ఉదయం 9 గంటల నుంచి పూర్ణామార్కెట్ సమీపంలో ఉన్న క్రాంతి థియేటర్ లో ఉగాది సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. అల్పాహారం నుంచి మధ్యాహ్నం విందు భోజనం వరకు ఆయా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కవిసమ్మేళనం, పంచాంగశ్రవణం, పంచాంగాల పంపిణీతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహిళలకు ప్రత్యేకంగా చీరలు పంపిణీ చేస్తామన్నారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా పంచాంగ శ్రవణం నిర్వహించిన పండితులతో పాటు అతిథులను ఘనంగా సత్కరించనున్నట్లు వీరు వివరించారు. కావున వర్కింగ్ జర్నలిస్టులంతా ఈ ఉగాది సంబరాల్లో పాల్గొని జయప్రదం చేయాలని వీరు కోరారు.ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ లు డి .రవికుమార్, పితాని ప్రసాద్, ఉపాధ్యక్షులు బండారు శివప్రసాద్,రామకృష్ణ జాయింట్ సెక్రెటరీ రాంబాబు,నగేష్ బ్రాడ్ కాస్ట్ అధ్యక్షుడు ఇరొతి ఈశ్వరరావు కార్యదర్శి మాధవ్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ జగన్మోహన్,కార్యదర్శి బొబ్బర ప్రసాద్, కార్యవర్గ సభ్యులు కె వి శర్మ, మధురవాడ ఆనంద్, రాజశేఖర్, కిషోర్, హరి,

బోయిన్ మార్కెట్ లో సర్కార్ సొత్తు నీళ్లలా ఖర్చు

- ఇరవై లక్షల రూపాయలు విద్యుత్ బిల్లులు బకాయిలు,

మందిపాలు అయితున్న కరెంట్,పట్టించుకునే నాథుడే లేడు.

- చిన్న,పెద్ద వాహనాల్లో నీళ్లు నింపుతే "100-300 లు మార్కెట్ సిబ్బందికి ఇవ్వాల్సిందే

- మునకాళ్లు, శామగడ్డ, గాజర్ కి నిత్యం నీరు ఉండాల్సిందే,

దీన్నే అదునుగా నెలకి యాభై వేల రూపాయలు వసూలు చేస్తున్న సిబ్బంది

- ఆర్కే షాపులో కొనుగోలు నాగ్ పూర్ కి తరలింపు, మధ్యలో

పోస్త హమాలీలు నిర్వహకం వల్ల కరెంట్ బిల్లుల మోత

- ఆగస్టు:2,38,808.అక్టబర్:2,30,538.నవంబర్:2,41,524.డిసెంబర్:1,97,066.

నాలుగు నెలల నుంచి లక్షల రూపాయలు విద్యుత్

బిల్లులు బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో మార్కెట్

- యార్డ్ ఇంచార్జ్ నిర్లక్ష్యమే దీనికి కారణం అంటున్న మార్కెట్ వర్గాలు

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న బోయిన్ పల్లి మార్కెట్ అధికారులు.మార్కెట్ లో ప్రతి రోజూ సుమారు ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.వీరిని దృష్టిలో ఉంచుకుని నాలుగు వాటర్ ట్యాంక్ లో ప్రతి రోజూ నీటిని నింపుతున్న మార్కెట్ సిబ్బంది.దూర ప్రాంతంలో నుంచి వచ్చే భారీ వాహనాల దారుల కోసం,వివిధ రకాల వారి కోసం నీటిని అందుబాటులో ఉంచుతారు.అలాగే మార్కెట్ లో మరుగుదొడ్లు వద్ద కూడా నీటిసంపులో సైతం నీళ్లను ఏర్పాటు చేస్తారు.అయితేబోయిన్ మార్కెట్ లో నిత్యం వివిధ రకాల అవసరాల కోసం విద్యుత్ ని ఉపయోగించుకుంటూ సగటున ప్రతి నెలా లక్ష వరకు విద్యుత్ బిల్లులు రావాల్సింది.సిబ్బందిచేతి వాటం వల్ల లక్షకు లక్ష పెరిగి తడిసిపోతుంది.కారణంప్రతి రోజూ మార్కెట్ కి ఇరవై ఐదు వేల టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.దీంట్లో ముఖ్యంగా కొన్ని కూరగాయలు నీళ్లు లేకపోతే పాడైపోతాయి.అయితే కొంతమంది నిర్వాహకులు నిర్వాకం వల్ల కరెంట్ బిల్లులు చూస్తేనే షాక్ కొడుతుంది.నిన్న మంగళవారం ఉదయం 11:30 ఆర్కే షాపులో 36 సంచుల మునకాళ్లు కొనుగోలు చేసిన ఖరీదు దారులు "పోస్తహమాలీల"సహాయంతో "మార్కెట్ కార్యాలయానికి,క్యాంటిన్ కి మధ్యలో ఉన్న కొలాయి దగ్గర "మహారాష్ట్రానికి చెందిన బొల్లోర వాహనంలో ఉన్న మునకాళ్లుతో లోడ్ అయిన బండిని సుమారు నలభై నిమిషాల పాటు తడుపుతూ నీటిని వృథాగా చేస్తూ,కరెంట్ బిల్లులు అధికంగా రావడానికి ఓ కారణం.ఇదే కాదు పట్టించుకునేవాడు లేడని మార్కెట్ లో బయట వాహనాలు సైతం కడుగుతుంటే "సినిమా చూస్తారు"మార్కెట్ సిబ్బంది.మరో విషయం ఏమిటంటే ప్రతి రోజూ మార్కెట్ లో ప్రతి ఐదు వాహనాలు ఇతర రాష్ట్రాలకు కూరగాయలను తరలిస్తున్నారు.అందులో మునకాళు ,్లషామగడ్డ,ఆగ్ర గాజర్ తదితర కూరగాయలకు నీళ్లు లేకపోతే

తొందరగా చెడిపోతాయి.అందుకనే పోస్త హమాలీలు సహాయంతో మార్కెట్ లో బయట వాహనాలకు నీళ్లు నింపి చిన్న,పెద్దవి తేడ లేకుండా మార్కెట్ సిబ్బంది పదిహేను వందల రూపాయలు వసూలు చేస్తున్నారు.అసలు గుట్టు ఇక్కడే మొదలౌతుంది.గేట్ ఎంట్రీ వద్ద నమోదు అయిన వాహనాల చిట్ట ఆధారంగా సిబ్బంది చిల్లర వసూల్ చేస్తున్న మితిమీరిన మేధావులు.మార్కెట్ కార్యాలయానికే పరిమితం అయ్యే అధికారులకు యార్డ్ లో జరుగుతున్న"జంతర్ మంతర్"గురించి ఏమీ తెలుసు!అందుకనే ఆఫీస్ కాకుండా మార్కెట్ లో ఓ రౌండ్ వేస్తే గానీ వాస్తవాలు వెలుగులోకి రావన్నారు మార్కెట్ వర్గాలు.అదిగాక యార్డ్ లో విద్యుత్ దీపాలు ఆఫ్ చేయడంలో నిర్లక్ష్యం, వాటర్ ట్యాంక్ లో నీరు వృథాగా పోతున్న పట్టించుకునే నాథుడే కరువు.మార్కెట్ కార్యాలయంలో కూడా ఇష్టానుసారంగా లైట్స్, ఫ్యాన్స్, అధికారులు ఉన్న లేకపోయినా అలా వెలుగుతూనే ఉంటాయి. బాధ్యతరహితంగా వ్యవహరిస్తున్న సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం ప్రతి నెలా విద్యుత్ బిల్లులు మోత మోగుతున్నాయి. ఉదాహరణకు ఆగస్టులో విద్యుత్, వాటర్ పర్పస్ వాడిన బిల్లు:2,38,808.అక్టోబర్మాసంలో:2,3,0,538. నవంబర్ లో:2,41, 524.డిసెంబర్ లో:1,97,066.ఇలాప్రతి నెలా అక్షరాలా రెండు లక్షల రూపాయలు విద్యుత్ బిల్లులు

వస్తుంటే అధికారులు, సిబ్బంది ఆధా చేయాల్సింది పోయి "బిల్లు సర్కార్ కి,చిల్లర మాకు అంటూ వ్యవహరిస్తున్నారు.ఇలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటే గానీ మార్కెట్ ఓ గాడిలో పడదని, ఇదే వ్యవహారశైలితో అధికారులు ముందుకు పోతే చివరకు"బోయిన్ పల్లి మార్కెట్ లో అంధకారమే"అంటున్నారు నిపుణులు.బయో గ్యాస్ ఉత్పత్తి అంతంత మాత్రమే: డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం"బయో గ్యాస్ కేంద్రం ".మనీకి బాత్ లో దేశ ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బోయిన్ పల్లి మార్కెట్ లో ఏర్పాటు చేసిన బయో గ్యాస్ కేంద్రం భవిష్యత్తులో సత్ఫలితాలు వస్తాయని,అలాగే దేశంలోనే మొట్టమొదటి సారిగా బయో గ్యాస్ కేంద్రం పరిచయం చేశామన్నారు.చెడిపోయిన కూరగాయల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రక్రియ కేంద్రం.ప్రతి రోజు పది టన్నుల వ్యర్థ కూరగాయలతో బయో గ్యాస్ కేంద్రం నడుస్తోంది.దీన్ని ద్వారా యార్డ్ లో సుమారు మూడు వందల యూనిట్లు కరెంట్ విడుదల అవుతుందని అధికారులు వెల్లడించారు.కానీ అక్కడ కూడా పడకేసిన బయో కేంద్రం.కొత్తగా బాధ్యతలు చేపట్టిన సెక్రటరీ చొరవతో మళ్లీ అందుబాటులోకి బయో గ్యాస్ కేంద్రం రావడం అందరూ హర్షించారు.కానీమార్కెట్ సిబ్బంది చేతి వాటం వల్ల ప్రభుత్వం లక్షల రూపాయలు నష్టపోతుంది.

ఉన్నతాధికారులు చొరవ లేకపోతే భవిష్యత్తులో బోయిన్ పల్లి మార్కెట్ "అంధకారానికి కేరాఫ్"గా నిలుస్తుంది.ఇప్పటికైనా బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సెక్రటరీ కలిసి జరుగుతున్న తతంగం పై ఆర తీసి తగిన చర్యలు తీసుకోవాలని మార్కెట్ వర్గాలు డిమాండ్ చేస్తున్నారు.

జన్సున్వాయ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని బాధిత మహిళల నుంచి ఆర్ డ బి

అతిథి గృహంలో "జన్ సున్వాయి" స్పెషల్ డ్రైవ్ - ఫిర్యాదుల స్వీకరణ

రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్)మహిళల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్ సున్వాయి స్పెషల్ డ్రైవ్లో భాగంగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ రాయపాటి శైలజ ఈ నెల 12వ తేదీ (గురువారం) రాజమహేంద్రవరం నగరానికి రానున్నారని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి టి. శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.మార్చి 12 ఉదయం స్థానిక ఆర్ డ బి అతిథి గృహంకు చేరుకుని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని (తూర్పు గోదావరి, కాకినాడ, డా బి ఆర్ అంబేద్కర్, పోలవరం (రంపచోడవరం) జిల్లాలకు చెందిన బాధిత మహిళల సమస్యలను స్వయంగా తెలుసుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ డ బి అతిథి గృహంలో నూతనంగా ఏర్పాటు చేసిన సమావేశ మందిరంలో మహిళల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. గృహహింస, వేధింపులు ఇతర అన్యాయాలకు గురైన మహిళలు ఈ "జన్ సున్వాయి" స్పెషల్ డ్రైవ్లో తమ ఫిర్యాదులను సమర్పించవచ్చని ఆమె తెలిపారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఆధ్వర్యంలో సత్వర చర్యలు తీసుకుని వేగవంతంగా పరిష్కారం కల్పించే చర్యలు తీసుకోనున్నట్లు , కావున ఈ అవకాశాన్ని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని బాధిత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా యంత్రాంగం, లీగల్ సెల్, పోలీస్ శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

తిరుమల ఘాట్ రోడ్డుకు ప్రైవేటు వాహనాల శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు వాహన తనిఖీ

ట్రాఫిక్ పోలీసులు జిల్లా రవాణా శాఖ అధికారి.

తిరుపతి(ప్రశ్న న్యూస్)తిరుమల ఘాట్ రోడ్డుకు ప్రవేశ ద్వారం అయిన అలిపిరి టోల్ గేట్ వద్ద శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు తిరుపతి మోటార్ వాహన తనిఖీ అధికారులు మరియు తిరుమల ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అధిక శబ్దం చేసే మార్పు చేసిన సైలెన్సర్లు (మోడీఫైడ్ సైలెన్సర్) ఉపయోగిస్తున్న ద్విచక్ర వాహనాలు ఇతర వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి తనిఖీలు నిర్వహించారు. అధికంగా శబ్ద కాలుష్యాన్ని వెలువరిస్తున్న జీపులు ఇతర రవాణా వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూమోటార్ వాహన చట్టంలోని మోటార్ వెహికల్ చట్టం, 1988 ప్రకారం వాహనాల్లో అనుమతించిన డేసిబెల్స్ పరిమితిని మించిపోయే విధంగా శబ్దం చేసే సైలెన్సర్లు ఉపయోగించడం నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు ఈ తనిఖీలలో తిరుమల ట్రాఫిక్ సీఏ హరిప్రసాద్, మోటార్ వాహన తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్ కుమార్ ,రమణ నాయక్, అతికానాజ్ , స్వర్ణలత ప్రసాద్ వర్మ పాల్గొన్నారు

మేడ్చల్‌లో ఘనంగా శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తోటకూర వజ్రేష్ యాదవ్

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)ఎమేడ్చల్ సర్కిల్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ కమిటీ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు భక్తి భావంతో నైవేద్యాలు సమర్పించి, హారతులు ఇచ్చారు.అమ్మవారి ప్రతిష్ఠాపన సందర్భంగా వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంచుతాయని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రాంతం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, వేముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ చాపరాజు, మాజీ కౌన్సిలర్ జాకట దేవ, అగ్రికల్చర్ డైరెక్టర్ రేగు రాజు, రాఘవేందర్ గౌడ్, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, జైపాల్ రెడ్డి, ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సమైక్య సంఘం భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి

- సిపిఎం పార్టీ మండల కన్వీనర్ : గురిజాల శ్రీధర్ డిమాండ్

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, రత్నంపేట గ్రామంలోని మహిళా సమైక్య (సంఘం) భవనం పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదని మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురిజాల శ్రీధర్ విమర్శించారు. గ్రామాల్లో మహిళలకు సమావేశాలు నిర్వహించుకోవడం, ప్రతి నెల పొదుపు చిట్టీలు, బ్యాంకు రుణాలపై చర్చించుకోవడం కోసం మహిళా సంఘ భవనాలు అవసరమని తెలిపారు.ప్రభుత్వం గుర్తించి గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించి కొత్త మహిళా సమైక్య భవనాల నిర్మాణం చేపట్టడంతో పాటు పాత భవనాలకు మరమ్మత్తులు చేసి మహిళలకు అందుబాటులోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జాగిర్యాల గ్రామ సర్పంచ్ : గడాల ప్రసాద్

-పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేసిన గడాల ప్రసాద్

భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండలం, జాగిర్యాల గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు గ్రామ సర్పంచ్ గడాల ప్రసాద్ మంగళవారం పరీక్షా ప్యాడ్లు,పెన్నులు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడాల ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను చేరుకోవాలంటే ఇప్పటి నుంచే లక్ష్యంతో,పట్టుదలతో చదివి, ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. గురువులు బోధించిన పాఠాలను శ్రద్ధగా చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. విద్యార్థుల విజయం వారి కుటుంబాలకు మాత్రమే కాకుండా గ్రామానికి కూడా గౌరవం తీసుకువస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు

- ట్రాక్టర్ స్వాధీనం, నిందితుడు రిమాండ్

- బోయినిపల్లి ఎస్సై : రమాకాంత్

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామ శివారులో గల గంజి వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని బోయినిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఉదయం స్తంభంపల్లికి చెందిన చంద్రగిరి భరత్ ట్రాక్టర్ నెంబర్ : టీజీ 23ఎ1162 / 1163 ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకొని అతన్ని పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.నిందితుడిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీరో హ్యూమన్, యానిమల్ లాస్ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

-ఎండ తీవ్రత, వడగాల్పులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ - 2026' ఆవిష్కరణ

-మధ్యాహ్నం 12-4 గంటల మధ్య జరిగే పనులను రీషెడ్యూల్ చేసుకోవాలి

-రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత

విజయవాడ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. స్థానిక తాడేపల్లి లోని మంగళవారం ఏపిఎస్డీఎంఏ (ఏపీ ఎస్ డి ఎమ్ఏ) కార్యాలయంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్ మెంట్స్, విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో

ఎండ తీవ్రత, వడగాల్పుల సంసిద్ధతపై రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాల్పుల దృష్ట్యా ప్రజల ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ - 2026' ను మంత్రి ఆవిష్కరించారు. హీట్ వేవ్ మరణాలు లేకుండా శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించారు. విపత్తు నిర్వహణ సంస్థ మరియు ఆర్టీజీఎస్ (ఆర్టిజిఎస్) నుండి అందే వడగాల్పుల హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, వారిని అప్రమత్తం చేయాలని కలెక్టర్లకు మంత్రి సూచించారు. ఒక్క ప్రాణం కూడా వడదెబ్బ వల్ల పోకూడదనే లక్ష్యంతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల వరకు బహిరంగ ప్రదేశాల్లో ఎటువంటి పనులు చేయకుండా పనివేళలను రీ షెడ్యూల్ చేయాలని హోంమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా కార్మికులు, వృద్ధులు, పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ బారిన పడే వారి కోసం ఆసుపత్రులలో ప్రత్యేక బెడ్లు, మందులు మరియు అంబులెన్సులను సిద్ధం చేయాలని వైద్య శాఖను ఆదేశించారు.

సమీక్ష సమావేశంలో ఎస్డీఆర్ఎఫ్ ఐజిపి రాజకుమారి, ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, ఫైర్ డిపార్టమెంట్ అడిషనల్ డైరెక్టర్ జ్ఞానసుందర్, జిల్లాల నుంచి కలెక్టర్లు, డిఆర్వోలు వర్చువల్ గా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మామూళ్లు కొట్టు, అక్రమ బియ్యం దందా పెట్టు

సివిల్ సప్లై అధికారులకు ప్రతినెల మామూళ్ల.?

ఆదిభట్లలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతుందా.?

పోలీసుల, సివిల్ సప్లై, టాస్క్ ఫోర్స్ అధికారుల నిర్లక్ష్యమా.?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రేషన్ బియ్యం పేదల కడుపు నింపడానికి ప్రభుత్వం పంపిణీ చేసే అత్యంత ముఖ్యమైన సంక్షేమ పథకం. కానీ అదే రేషన్ బియ్యం ఇప్పుడు అక్రమ దందాలకు అడ్డాగా మారుతోంది. పేదలకు చేరాల్సిన బియ్యం మాఫియా చేతుల్లో పడుతూ కోట్ల రూపాయల అక్రమ వ్యాపారంగా మారింది. ముఖ్యంగా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ అక్రమ రేషన్ బియ్యం దందా రోజురోజుకూ పెరిగిపోతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్థానికంగా పనిచేస్తున్న రేషన్ బియ్యం మాఫియా అధికారుల కనుసైగల్లోనే యదేచ్ఛగా దందా సాగిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతినెల మామూళ్లు చెల్లిస్తే ఎలాంటి చర్యలు ఉండవనే ధీమాతో మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. పేదల కోసం ఇచ్చే బియ్యాన్ని పెద్దఎత్తున సేకరించి రహస్యంగా ఇతర రాష్ట్రాలకు తరలించడం, మార్కెట్లో అమ్మడం, ఫీడ్ మిల్లులకు సరఫరా చేయడం వంటి చర్యలు జరుగుతున్నాయి.

ఆదిభట్లలో జోరుగా రేషన్ బియ్యం దందా..

ఆదిభట్ల పరిధిలో బొంగులూరు గేట్ వద్ద రేషన్ బియ్యం అక్రమ రవాణా పెద్ద స్థాయిలో జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు కాలనీలు, గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి గిడ్డంగుల్లో నిల్వ ఉంచుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడి నుండి ఆటోలు, చిన్న లారీలు, ట్రాక్టర్ల ద్వారా రాత్రివేళల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ప్రత్యేకంగా రహదారులపై తెల్లవారుజామున లేదా అర్ధరాత్రి సమయంలో బియ్యం సంచులతో నిండిన ఆటోలు తిరుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి నిఘా లేదని అధికారులతో ముందుగానే అంతర్గత ఒప్పందాలు చేసుకుంటున్నారని స్థానికులు అంటున్నారు. రేషన్ బియ్యం ఆటోలు బహిరంగంగానే తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పేదల బియ్యం మాఫియా చేతుల్లోకి..

ప్రభుత్వం పేదల కోసం ఇచ్చే బియ్యం కొందరి చేతుల్లో పడుతూ అక్రమంగా మార్కెట్లోకి చేరుతోంది. కొంతమంది మధ్యవర్తులు రేషన్ కార్డు దారుల దగ్గర నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి గిడ్డంగుల్లో నిల్వ చేస్తారు. తర్వాత ఆ బియ్యాన్ని మిల్లులకు లేదా ఇతర రాష్ట్రాలకు భారీ ధరకు అమ్మేస్తారు. ఆదిభట్ల, పెద్ద అంబర్పేట్, చేగుంట, గజ్వేల్, నార్కట్పల్లి, నర్సాపూర్ తోపాటు వివిధ ప్రాంతాల లో ప్రతి నెల వేల క్వింటాళ్ల బియ్యం అక్రమంగా మార్కెట్లోకి వెళ్తోందని సమాచారం. దీని వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం జరుగుతుండగా నిజంగా అవసరమైన పేదలకు నష్టమే జరుగుతోంది.

సివిల్ సప్లై అధికారుల మౌనం..

అక్రమ రేషన్ బియ్యం దందా జరుగుతున్నప్పటికీ సంబంధిత సివిల్ సప్లై అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు.

మాఫియా ప్రతినెల మామూళ్లు చెల్లించడం వల్లే అధికారులు మౌనం పాటిస్తున్నారని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

"మామూలు కొట్టు.. దందా పెట్టు" అన్నట్టుగా వ్యవస్థ నడుస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

పోలీసుల నిఘా ఎక్కడ.?

ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రేషన్ బియ్యం ఆటోలు బహిరంగంగా తిరుగుతున్నా పోలీసుల నుంచి కఠిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. రహదారులపై బియ్యం సంచులతో నిండిన వాహనాలు యదేచ్ఛగా తిరుగుతున్నా నిఘా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని చెబుతున్నారు.

పోలీసులు ఒకసారి కఠినంగా వ్యవహరిస్తే ఈ దందా పూర్తిగా ఆగిపోతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఇప్పటివరకు అలాంటి చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

రాజకీయ అండ ఉందా.?

రేషన్ బియ్యం మాఫియా వెనుక రాజకీయ నాయకుల అండ ఉందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. కొందరు స్థానిక నాయకులు మాఫియాకు రక్షణ కల్పిస్తున్నారనే మాటలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. రాజకీయ అండ లేకుండా ఇంత పెద్ద స్థాయిలో అక్రమ రవాణా జరుగుతోందా అని ప్రజలు అంటున్నారు.

మాఫియాను కట్టడి చేయాల్సిన అధికారులే మౌనం పాటించడం వల్ల ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

ప్రభుత్వానికి కోట్ల నష్టం..

రేషన్ బియ్యం అక్రమ రవాణా వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం జరుగుతోంది. పేదల కోసం ఉద్దేశించిన ధాన్యం మాఫియా చేతుల్లో పడుతూ నల్లబజారులోకి వెళ్తోంది. దీని వల్ల ప్రజా ధనం వృథా అవుతోంది. ఇది కేవలం ఒక ప్రాంత సమస్య మాత్రమే కాదు. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు. ఆదిభట్ల ప్రాంత ప్రజలు రేషన్ బియ్యం మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా బియ్యం కొనుగోలు చేసే మధ్యవర్తులపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

అలాగే ఈ దందాకు సహకరించే అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి స్పందించాలి, కఠిన చర్యలు తీసుకోవాలి

రేషన్ బియ్యం పేదల హక్కు. ఆ హక్కును మాఫియా దోచుకుంటే అది సమాజానికి ప్రమాదకరం. కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి అక్రమ రేషన్ బియ్యం దందాను పూర్తిగా అరికట్టాల్సిన అవసరం ఉంది.సివిల్ సప్లై, పోలీస్ శాఖలు సంయుక్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రాత్రి, ఉదయం సమయాలలో రహదారులపై కఠిన తనిఖీలు నిర్వహించి బియ్యం తరలించే వాహనాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఆదిభట్ల, పెద్ద అంబర్ పేట లో జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం దందా అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ అండ, మాఫియా ధైర్యానికి నిదర్శనంగా మారిందిని పేదల బియ్యం అక్రమ వ్యాపారంగా మారడం ఆందోళనకరం. మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ వెంటనే కఠిన చర్యలు తీసుకోకపోతే ఈ మాఫియా మరింత బలపడే ప్రమాదం ఉంది.

ప్రజా పాలన- పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డులను శుభ్రత

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ప్రజా పాలన-పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది విస్తృతంగా శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి, రహదారులపై పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెత్త సేకరణ, శుభ్రపరచడం, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించి పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. ప్రజా పాలన-పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా పట్టణాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, పరిశుభ్రతను పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలు, పాల్గొన్నారు

కేంద్రీయ విద్యాలయ తరగతుల పనులను పరిశీలించిన: ఎమ్మెల్యే గౌత శిరీష

పలాస(ప్రశ్న న్యూస్) రైల్వే పాఠశాల భవనాల్లో కేంద్రీయ విద్యాలయ తరగతులు ప్రారంభించేందుకు జరుగుతున్న పనులను మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కృషి ఎనలేనిదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే అడ్మిషన్లు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అప్పలరాజు, ఎమ్మార్వో కళ్యాణ్ చక్రవర్తి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు లోడగల కామేశ్వరరావు, పట్టణ టీడీపీ కార్యదర్శి సప్ప నవీన్, గాలి కృష్ణారావు, చెల్లూరు రామక్రిష్ణ, కొత్త సత్యం, మల్లిపెద్ది చిన్ని, సవర రాంబాబు, డొక్కరి శంకర్, దడియాల నర్సింగులు, కొండె నర్సింగ్, జోగ మల్లి, రవిశంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- అంగన్వాడీ కేంద్రంలో నీటి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తా

- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్

- అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనుముల భాస్కర్

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ఆహారం,వారి హాజరు, నిర్వహణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం సమయానికి అందిస్తున్నారా, వారు ప్రతిరోజూ కేంద్రానికి వస్తున్నారా అనే విషయాలను అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అంగన్వాడీ కేంద్రంలో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించిన సర్పంచ్ అనుముల భాస్కర్, దీనిని రెండు రోజులలోపే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారుల

ఆరోగ్యం, భద్రత విషయాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుసుమ మహేందర్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు ఉమ్మారెడ్డి శైలజ--అనిల్ రెడ్డి, కుడుకల శ్రీకాంత్, అనుముల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా దినోత్సవ క్రీడలు

భారీగా తరలి వచ్చిన ఉద్యోగులు

మెదక్ ప్రతినిధి(ప్రశ్న న్యూస్) అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, టీఎన్జీవోస్ యూనియన్, గెజిటెడ్ అధికారుల ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ సహకారంతో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీలను, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవిల తో కలిసి ప్రారంభించారు. జ్యూట్ బ్యాగ్ జంపింగ్, మ్యూజికల్ చైర్, త్రెడ్ అండ్ నీడిల్, లెమన్ అండ్ స్పూన్, క్యారమ్స్, స్పీడ్ వాక్, చెస్ మరియు టగ్ ఆఫ్ వార్ క్రీడలు నిర్వహించగా ఉద్యోగులు అసక్తితో ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అధికారులు టీఎన్జీవో నాయకులు ఫిజికల్ డైరెక్టర్లు ఉద్యోగులను ఉత్సాహపరిచే విధంగా ప్రోత్సాహాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ సంక్షేమ అధికారి హేమ భార్గవిలు మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసే విధంగా అదే క్రమంలో విధి నిర్వహణలో ఎంతగానో ఒత్తిడితో పని చేస్తున్న మహిళ ఉద్యోగులకు ఈ ఆటల పోటీలు మానసిక ఉల్లాసాన్ని సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయని మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించామని తెలిపారు. విజేతలకు బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలలో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన మరియు క్రీడల శాఖ అధికారి రమేష్, ఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, సహ అధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు ఫజల్లుద్దీన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శి రాధ, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు సంతోష్, సహాధ్యక్షులు శ్రీకాంత్ తదితర మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పక్కగా భూ హక్కుల కోసం రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మంగళవారం రామాయంపేట మండలంలోని అక్కన్నపేట గ్రామంలో నిర్వహించిన భూభారతి రీ సర్వే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. 100 సంవత్సరాల పూర్వం నిజాం ప్రభుత్వం 35 నుంచి 40 సంవత్సరాల మధ్య కష్టపడి పనిచేసి భూమి నక్ష ను రూపొందించడం జరిగిందన్నారు. అప్పటినుంచి కొన్ని గ్రామాల్లో భూనక్షల్లో సమస్యల తలెత్తయన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకే భూ రీ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్లో పొంద పరుస్తామన్నారు. ఏలాంటి భూ వివాదాలు లేకుండా చేసి,భూమికి భూధార్ ను అందించడం జరుగుతుందన్నారు. భూమి ప్రతి రైతుకు ఒక సెంటిమెంట్ అని ,భూమికోసం రైతులు పరితపిస్తూఉంటారన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే దీని ఉద్దేశం అన్నారు.జిల్లాలో 24 గ్రామాల్లో భూ రిసర్వే ను శాస్త్రీయంగా నిర్వహించి రైతుల భూ హక్కులను పరిరక్షిస్థామన్నారు. భూ రిసర్వే అనంతరం విదేశాల్లో ఉన్న వాళ్ళు సైతం పక్కగా వారి భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి,ఎ .డి ల్యాండ్ సర్వే కిషన్, డి.పి ఆర్ ఓ రామచంద్ర రాజు,తహసిల్దార్ రజనీ,ఎంపీడీవో గ్రామ సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుంది

ఐసిడిఎస్ డైరెక్టర్ శృతి ఓజా

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) నర్సాపూర్ రెడ్డిపల్లి అంగన్వాడి సెంటర్ ను మెదక్ జిల్లా కేంద్రంలోని , బాలల సదనం సఖి కేంద్రాన్ని, ఐసిడిఎస్ డైరెక్టర్ శృతి ఓజా సోమవారం పరిశీలించారు.కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని జిల్లా కలెక్టర్ తో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆమె అన్ని అంగన్వాడీ కేంద్రాలలో కనీస సౌకర్యాల , విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు – అన్ని అంగన్వాడీ కేంద్రాలలో 100%. ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోసఖి కేంద్రాన్ని సందర్శించండి సిబ్బందితో సమీక్షించారు ణఎ కేసుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలసదనం నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి 99 రోజుల్లో పూర్తి చేసే దిశగా కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలని ఆదేశించారు.. బాలసదనాన్ని సందర్శించిన సిబ్బందితో మాట్లాడుతూ , పిల్లల సంరక్షణ పిల్లలకు పోషకాహారం అందించి బలాన్ని పెంచాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూపోషకాహార సేవలను బలోపేతం చేయడం, అంగన్వాడీ మౌలిక సదుపాయాలను పర్యవేక్షించడం జరిగిందని తెలిపారు.జిల్లాలోని సంక్షేమ శాఖ పనితీరు ఆదర్శంగా ఉందని అంగన్వాడి సెంటర్స్, సఖి సెంటర్లలో మెరుగైన సేవలు అందుతున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్ డి డబ్ల్యు ఓ హేమ భార్గవి ఐసిడిఎస్ సిడిపిఓలు సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

కాప్రా సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల మాఫియా

సీజ్ చేసిన భవనమే మళ్లీ ప్రారంభం

జిహెచ్ఎంసి చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా.?

కూల్చివేత కు ఆదేశాలు ఇవ్వని డిప్యూటీ కమిషనర్ శ్రీహరి

అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న

ఏసీపి కృష్ణమూర్తి, సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్

అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోండి టిఆర్ఎస్ పార్టీ గ్రేటర్

హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ మంత్రి వినోద్

ప్రజాప్రశ్న

మున్సిపల్ చట్టాలు

ఐ డోంట్ కేర్

కాప్రా (ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు చూస్తే అసలు మున్సిపల్ చట్టం ఇక్కడ పని చేయదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రెటరీ మంత్రి వినోద్ పేర్కొన్నారు. రెండుసార్లు సీజ్ చేసిన భవనానికి మళ్లీ పనులు ప్రారంభం కావడం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారిందని స్థానికంగా అందుతున్న సమాచారం ప్రకారం, అక్రమ నిర్మాణంపై అధికారులు ఇప్పటికే రెండు సార్లు సీజ్ చర్యలు చేపట్టినా, కొద్ది రోజులకే మళ్లీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీనికి కారణం భారీ స్థాయిలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఏసీపి కృష్ణమూర్తి, సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ లు సెటిల్మెంట్ చేసుకున్నారని అందుకోసమే చర్యలు తీసుకోవడం లేదని మంత్రి వినోద్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఏసిపి కృష్ణమూర్తి, సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్ పాత్రపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీజ్ చేసిన భవనానికి మళ్లీ పనులు ప్రారంభం కావడం వెనుక ఈ అధికారుల కనుసైగలే ఉన్నాయా.? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వస్తున్నాయన్నారు. జిహెచ్ఎంసి నిబంధనల ప్రకారం అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వెంటనే కూల్చివేత చర్యలు తీసుకోవాలి. కానీ కాప్రా సర్కిల్‌లో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా సాగుతుండగా టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలు మాత్రం కనిపించకపోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఒకసారి కాదు రెండుసార్లు సీజ్ చేసిన భవనానికి కూడా నిర్మాణం మళ్లీ ప్రారంభమవడం. ఇది కేవలం నిర్లక్ష్యమా లేక భారీ లంచాల వ్యవహారమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కాప్రా సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల వెనుక ఒక భారీ అవినీతి తిమింగలం పనిచేస్తోందా.? గతంలో ఆ త్రిమింగళం పనిచేసిన సర్కిల్లో అనేక అక్రమ నిర్మాణాలు జరిగాయని కోట్ల అవినీతి సొమ్ము సంపాదించారనే చర్చ కూడా జరుగుతోంది. అధికారుల ఆశీస్సులు లేకుండా ఇలాంటి అక్రమ నిర్మాణాలు సాధ్యం కావని స్థానికులు అంటున్నారు. మరోవైపు, అవినీతిని అరికట్టాల్సిన జిహెచ్ఎంసి విజిలెన్స్ విభాగం కూడా ఈ వ్యవహారంపై ఇప్పటివరకు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. విజిలెన్స్ అధికారులు నిజంగానే నిద్రపోతున్నారా.? లేక ఈ వ్యవహారంలో వాళ్లకు కూడా మామూళ్ళు ముట్టాయా.? అందుకోసమే పట్టించుకోకుండా వదిలేస్తున్నారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఉన్నతాధికారులు స్పందించి కాప్రా సర్కిల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే జిహెచ్ఎంసి చట్టాలు కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయన్న విమర్శలు మరింత పెరగడం ఖాయం.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి

– యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు : న్యాత నవీన్

– పదో తరగతి విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు న్యాత నవీన్ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. మంగళవారం చందుర్తి మండలంలోని చందుర్తి మండల కేంద్రం, మల్యాల గ్రామాలతో పాటు పలు గ్రామాల జిల్లా పరిషత్ హై స్కూల్‌లలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన ప్యాడ్స్‌తో పాటు 6 రకాల విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ విజయ్ కుమార్, రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపటి రామస్వామి, జిల్లా నాయకులు గొట్టే ప్రభాకర్, చందుర్తి సర్పంచ్ పులి సత్యం, ఆసిరెడ్డిపల్లి సర్పంచ్ బొజ్జ మల్లేశం, బండపల్లి సర్పంచ్ కటకం మల్లేశం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల పరిసరం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరీం, శ్రీనివాస్, ఉప సర్పంచ్‌లు క్రాంతి, పల్లపు ఇసాక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రసాద్, వెంకటేష్, చంద్రం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సమజాభివృద్ధికి పునాది

- బీసీ సాధికారత సంఘం గౌరవాధ్యక్షులు : కొండ దేవయ్య పటేల్

- మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- బీసీ సంఘం ఉత్తర తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి : పొలాస నరేందర్

- బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలో బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో 115వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి మహిళలకు సీట్లు పంపిణీ చేసి పలువురు మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, మహిళా సంక్షేమానికి ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని అన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జీ పొలాస నరేందర్ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. అలాగే సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొండ దేవయ్య పటేల్, పొలాస నరేందర్ లతో పాటుగా మారం కుమార్, గాదె శ్రావంతి, మారుపాక జల, పోసు మంజుల, బూలక్ష్మి, కల్యాణి, జ్యోతి, బాబాయి, ఇల్లందుల వెంకటేష్, మెరుగు జల, శ్రీనిధి, చింతల కోటి రామస్వామి గౌడ్, కనపర్తి సుధాకర్, కొణతాల తిరుపతి, తూమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న నాగాలాండ్ ఐపీఎస్ అధికారి పి. రమణియ దంపతులు

తిరుమల (ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని నాగాలాండ్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి, దిమాపూర్ ఎస్పీ పి. రమణియ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం విరామ సమయంలో తన ధర్మపత్ని డాక్టర్ ఐశ్వర్యతో కలిసి ఆయన స్వామివారిని సందర్శించారు. మొదట వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన ఈ దంపతులకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వీరికి ఆశీర్వచనం పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు. పి. రమణియ (2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారి) ప్రస్తుతం నాగాలాండ్ క్యాడర్‌లో దిమాపూర్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తన భార్య డాక్టర్ ఐశ్వర్యతో కలిసి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల రమణియ మీడియాతో మాట్లాడుతూ శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఆలయ అధికారులు మరియు భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 27న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు

రానున్న ప్రియదర్శి 'సుయోధన'

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో అలరిస్తున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సుయోధన'. ఈ సినిమాకు సంబంధించి తాజాగా మేకర్స్ ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్ర బృందం విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్ ప్రస్తుతం సినీ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది.ప్రజ్వల లైన్ క్రియేషన్స్ బ్యానర్‌పై బోసుబాబు నిడుమోలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి, వై.ఎస్. మాధవ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రియదర్శి సరసన ద్రిషిక చందర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా 'డైలాగ్ కింగ్' సాయికుమార్ మరియు సీనియర్ నటి ప్రేమ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.ఈ సందర్భంగా నిర్మాత బోసుబాబు నిడుమోలు మాట్లాడుతూ, "ఒక మంచి కథ, కథనాలతో అత్యుత్తమ నిర్మాణ విలువలతో 'సుయోధన' చిత్రాన్ని రూపొందించాము. ప్రియదర్శి, సాయికుమార్ గారి నటన సినిమాకు ప్రాణం పోశాయి. సంగీత దర్శకుడు జై క్రిష్ అందించిన స్వరాలు, రామజోగయ్య శాస్త్రి గారి సాహిత్యం ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యాము. త్వరలోనే టీజర్, ట్రైలర్ మరియు పాటలను విడుదల చేస్తాము" అని తెలిపారు.

సెన్సార్ పూర్తి చేసుకున్న

'ఉస్తాద్ భగత్ సింగ్'.. రన్ టైమ్ లాక్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ నేడు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'ఖ/ూ' సర్టిఫికేట్ జారీ చేసినట్లు చిత్రబృందం ప్రకటించింది. గతంలో పవన్ నటించిన 'ూ+' చిత్రానికి గ్యాంగ్‌స్టర్ డ్రామా కారణంగా 'ూ' సర్టిఫికేట్ రాగా, ఈసారి 'ఉస్తాద్' కు 'ఖ/ూ' రావడంతో కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి చూసే అవకాశం లభించబోతుంది. మరోవైపు ఈ సినిమా మొత్తం 2 గంటల 29 నిమిషాల రన్ టైమ్‌తో రాబోతుందని సమాచారం. ప్రస్తుత కాలంలో వస్తున్న భారీ సినిమాలతో పోలిస్తే, ఈ కాంపాక్ట్ నిడివి సినిమాకు ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎక్కడా బోర్ కొట్టకుండా పక్కా కమర్షియల్ ప్యాకేజీతో హరీష్ శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది.

పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశీ ఖన్నా ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలకు ఇప్పటికే భారీ రెస్పాన్స్ వస్తుండగా, తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాను మరో లెవల్‌కు తీసుకువెళ్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

కాంతారావుని చూస్తే MGRకి ప్యాంట్ తడిసేది..

మళ్ళీ నోరు జారిన రాజేంద్ర ప్రసాద్

నటకిరీటి రాజేంద్ర ప్రసాద్ మరోసారి తన నోటి దురుసుతో తీవ్ర వివాదంలో చిక్కుకున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'కళాప్రపూర్ణ కాంతారావు జాతీయ అవార్డు-2025' ప్రధానోత్సవ వేదికపై ఆయన చేసిన ప్రసంగం ఇప్పుడు సోషల్ మీడియాలో వివాదంగా మారింది. దివంగత నటుడు కాంతారావు గొప్పదనాన్ని వివరించే క్రమంలో, తమిళ ప్రజల ఆరాధ్య దైవం, మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ (M.G. Ramachandran) పట్ల ఆయన వాడిన పదజాలం తీవ్ర అభ్యంతరకరంగా ఉందనే విమర్శలు సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నాయి. కాంతారావు గారి జానపద చిత్రాలను చూసి ఎంజీఆర్ భయపడి 'ఉచ్చ పోసుకునేవాడు' అంటూ రాజేంద్ర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువుగా మారాయి. ఆ కాలంలో కాంతారావు నటనను చూసి ఎంజీఆర్ వణికిపోయేవాడని, ఎవడ్రా వీడు ఇండియన్ సినిమాలను ఎక్కడికో తీసుకెళ్లిపోతున్నాడు అని భయపడేవాడంటూ రాజేంద్ర ప్రసాద్ అగౌరవంగా మాట్లాడటంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముఖ్యంగా తమిళనాడులో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఒక లెజెండరీ నటుడిని గౌరవించే క్రమంలో, మరొక దిగ్గజ నటుడిని, కోట్ల మంది ఆరాధించే నాయకుడిని తక్కువ చేసి మాట్లాడటం రాజేంద్ర ప్రసాద్ సంస్కారానికి తగదని విమర్శకులు మండిపడుతున్నారు. గతంలో కూడా బ్రహ్మానందం, అలీ వంటి సహ నటులపై రాజేంద్ర ప్రసాద్ ఇలాగే వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. పద్మశ్రీ వంటి ప్రతిష్టాత్మక పురస్కారం పొందిన ఒక సీనియర్ నటుడు, బహిరంగ వేదికలపై ఇలాంటి పదజాలాన్ని వాడటం పట్ల అటు సినీ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజల్లోనూ చర్చ జరుగుతోంది.

ఊరించి ఉసూరుమనిపించారా..

రజనీకాంత్-కమల్ హాసన్ మల్టీస్టారర్ ఇప్పట్లో లేనట్టే.!

సినిమా ఇండస్ట్రీలో ఇద్దరు హీరోలు కలిసి నటిస్తేనే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడతాయి. ఒక స్టార్ హీరోతో పాటు మరో మీడియం రేంజ్ హీరో నటించినా కూడా ఆ సినిమాకు మంచి బజ్ వస్తుంది. అలాంటిది దశాబ్దాలుగా ఇండస్ట్రీని ఏలుతున్న ఇద్దరు లెజెండరీ స్టార్స్ ఒకే సినిమాలో ఫుల్ లెంగ్త్ రోల్స్‌లో కనిపించబోతున్నారు అంటే అంచనాలు ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రస్తుతం సినీ ప్రేక్షకుల దృష్టంతా సూపర్ స్టార్ రజనీకాంత్, యూనివర్శల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించబోతున్న భారీ మల్టీస్టారర్ సినిమాపైనే ఉంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మొదటగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోగా, ప్రస్తుతం దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు సమాచారం.ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల కావడంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ తమదైన స్టైల్, స్వాగ్‌తో తెరపై కనిపిస్తే సినిమా మరో లెవెల్‌లో ఉంటుందనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. అందుకే ఈ ప్రాజెక్ట్ గురించి చిన్న వార్త వచ్చినా కూడా అది పెద్ద చర్చగా మారుతోంది. అయితే సినిమా ప్రారంభం, విడుదల తేదీల గురించి మాత్రం విభిన్న వార్తలు వినిపిస్తున్నాయి. తమిళ సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ప్రస్తుతం దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ "జైలర్ 2" సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా పూర్తయ్యే వరకు ఈ మల్టీస్టారర్‌పై ఆయన పూర్తి దృష్టి పెట్టే అవకాశం లేదని టాక్ వినిపిస్తోంది. అందువల్ల ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కావడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉంది. 2026 చివర్లో ఈ సినిమాను పట్టాలెక్కించే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇక ఈ భారీ మల్టీస్టారర్ సినిమాను చాలా ప్లానింగ్‌తో తెరకెక్కించాలని దర్శకుడు భావిస్తున్నట్లు సమాచారం. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరికీ సమాన ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఉండేలా కథను సిద్ధం చేస్తున్నారట. యాక్షన్, ఎమోషన్, డ్రామా మేళవింపుతో పాటు ఇద్దరి కాంబినేషన్ సీన్స్ కూడా ఎక్కువగా ఉండేలా స్క్రిప్ట్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. షూటింగ్ ప్రారంభమైన తర్వాత సుమారు ఆరు నెలల్లో పూర్తి చేసేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. అయినప్పటికీ ఇద్దరు సూపర్ స్టార్స్ డేట్స్ సర్దుబాటు కావడం కూడా కీలక అంశంగా మారింది. ప్రస్తుతం రజనీకాంత్ "జైలర్ 2"తో బిజీగా ఉండగా, కమల్ హాసన్ కూడా పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. దీంతో ఇద్దరి డేట్స్ సమన్వయం కావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఈ కారణాల వల్ల ఈ సినిమా విడుదల 2027 చివర్లో ఉండొచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ డేట్స్ లేదా ఇతర కారణాలతో ఆలస్యం అయితే 2028 వరకు కూడా రిలీజ్ వాయిదా పడే అవకాశం ఉందని అంటున్నారు.

ఎట్టకేలకు ఓటీటీలోకి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'..

స్ట్రీమింగ్ ఎప్పుడంటే!

మాస్ మహారాజా రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రం ఎట్టకేలకు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 13న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద మంచి విజయం అందుకున్నప్పటికీ డిజిటల్ ప్రీమియర్ కోసం ప్రేక్షకులు భారీగా ఎదురుచూస్తున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 (జుజు5) ఈ చిత్ర డిజిటల్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. దీంతో ఈ వారం మార్చి 13 శుక్రవారం నుంచి ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.డైరెక్టర్ కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఫ్యామిలీ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కథానాయికలుగా నటించారు. సునీల్, సత్య, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించగా, భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. థియేటర్లలో విడుదలైన దాదాపు 60 రోజుల తర్వాత ఓటీటీలోకి వస్తున్న ఈ చిత్రం, రవితేజ మార్క్ కామెడీ మరియు ఫ్యామిలీ సెంటిమెంట్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ వీకెండ్‌లో మంచి వినోదాన్ని అందిస్తుందని చెప్పవచ్చు.

'రామాయణం' సెట్స్ నుంచి రణబీర్,

సాయి పల్లవి ఫొటోలు లీక్ చిత్రబృందం క్లారిటీ

బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణం'కు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఫొటో తెగ వైరలవుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ సెట్స్ నుంచి రాముడిగా నటిస్తున్న రణబీర్‌తో పాటు సీతగా నటిస్తున్న సాయి పల్లవిల ఫొటోలు లీక్ అయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుంది. అయితే ఈ ప్రచారంపై చిత్రబృందం స్పందిస్తూ..

ఆ ఫొటోలు నకిలివని.. అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సాంకేతికతతో సృష్టించిన ఫేస్-స్వాప్ చిత్రాలని చిత్రబృందం తెలిపింది. 2015లో ప్రసారమైన 'సియా కే రామ్' సీరియల్‌లోని స్టిల్స్‌ను తీసుకుని, అందులోని నటీనటుల ముఖాలకు బదులుగా రణబీర్, సాయి పల్లవి ముఖాలను ఆకతాయిలు ఎడిట్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది.

నితీష్ తివారీ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్, సాయి పల్లవితో పాటు రావణుడిగా యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ఈ భారీ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. ఇందులో మొదటి భాగం 2026 దీపావళికి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండగా అధికారిక పోస్టర్లు త్వరలోనే విడుదల కానున్నాయి.

ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

రికార్డులు, ఫైళ్లు నిబంధనల ప్రకారం భద్రపరచాలి

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఐడీఓసీలో ప్రతి అంతస్తులోని కార్యాలయం తనిఖీ

సిరిసిల్ల(ప్రశ్న న్యూస్). ప్రతి ప్రభుత్వ కార్యాలయం నిరుపయోగ వస్తువులు, పరికరాలు తొలగించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై తనిఖీ చేశారు.గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్ లోని నీటి పారుదల శాఖ, ఈఈ పీ ఆర్, ఆర్ అండ్ బీ, బీసీ సంక్షేమ శాఖ, డీటీ సీపీఓ, కార్మిక శాఖ, భూగర్భ శాఖ, డీఆర్ డీఓ, మైనింగ్, సీపీఓ, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సహకార శాఖ, ఎక్సైజ్, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పౌర సరఫరాల శాఖ, ఉపాధి కల్పన శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా పంచాయతీ ఆఫీస్, ట్రెజరీ శాఖ, ఏవో ఆఫీస్, డీపీఆర్ఓ, సంక్షేమ శాఖ తదితర కార్యాలయాలను కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని వివిధ గదుల్లో ఉన్న ఫర్నిచర్, ఫైల్స్, రికార్డులు, సామగ్రి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి జిల్లా శాఖ కార్యాలయం, మండలాల్లోని కార్యాలయాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యాలయంలోని ఫైళ్లు, రిజిస్టర్లు స్టోర్ రూమ్ లా సిద్ధం చేయాలని, నిబంధనల ప్రకారం భద్రపరచాలని స్పష్టం చేశారు. అనవసరమైనవి తొలగించాలని సూచించారు. కార్యాలయం ఆవరణలోనిర నిరుపయోగ వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు తొలగించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న కుండీల్లో మొక్కలు పెట్టించాలని కలెక్టర్ తెలిపారు. పరిశీలనలో కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సైన్స్ ఒలంపియాడ్,

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్.లో కాకతీయ హై స్కూల్ విద్యార్థుల ప్రభంజనం.

ప్రధానోపాధ్యాయులు.ప్రదీప్ రెడ్డి.

మంథని (ప్రశ్న న్యూస్)విద్యార్థుల్లో సైన్స్ గణితం పట్ల ఆసక్తిని పెంచడాని సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు నిర్వహించే అంతర్జాతీయ స్థాయి ఒలింపియాడ్ పరీక్షలైన నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ . ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని కాకతీయ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు అని పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ ఈ పరీక్షలను సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది. దేశంలోని వేలాది పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొంటారు.ఈ సంవత్సరం జరిగిన ఎన్ ఎస్ ఓ లో దాదాపు గా 200 మంది విద్యార్థులు పాల్గొని 146 మంది విద్యార్థులు సెకండ్ లెవెల్ కి ఉత్తీర్ణత సాధించి 128 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. అలాగే ఐఎంఓ పరీక్షల్లో 248 మంది విద్యార్థులు పాల్గొని 74 విద్యార్థులు సెకండ్ లెవెల్ కి ఉత్తీర్ణత సాధించి 44 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ తో మా కాకతీయ హై స్కూల్ విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించి పాఠశాలకు గౌరవం తెచ్చారు. పరీక్షల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికేట్లు అందజేయడం జరిగింది అని అన్నారు.తమ జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని కష్టపడి సాధన చేస్తే విజయం తప్పకుండా సాధ్యమని సమయపాలన, క్రమశిక్షణ సానుకూల ఆలోచనలు విజయానికి ముఖ్యమని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమం నికి ముఖ్య అతిథిగా వచ్చిన అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజనీ మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. అలాగే చదువుతో పాటు మంచి నైతిక విలువలు కూడా జీవితంలో ఎంతో ముఖ్యమని అన్నారు ఈ కార్యక్రమంలో మంథని సిఆర్పి మల్లయ్య, పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, స్రవంతి రెడ్డి, పావని రెడ్డి, తల్లిదండ్రులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సుభాష్ నగర్‌లో హెచ్.పి.వి. వ్యాక్సిన్ పై అవగాహన

వేములవాడ (ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ రజక సంఘం వద్ద హెచ్.పీ.వీ.వ్యాక్సినేషన్ పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డా. దివ్యశ్రీ (మెడికల్ ఆఫీసర్), డా. నయీమ్ జహాన్ (ప్రోగ్రాం ఆఫీసర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26-02-2011 నుండి 25-02-2012 మధ్య జన్మించిన 14 సంవత్సరాల బాలికలు తప్పనిసరిగా హెచ్.పీ.వీ.వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు. ఈ వ్యాక్సిన్ మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నివారణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇప్పపూల అజయ్ – మమత, శ్రీనివాస్,రజక సంఘం మాజీ రాష్ట్ర కన్వీనర్ మైలారం రాము, రజక సంఘం అధ్యక్షులు బాలయ్య, దేవయ్య,రజక సంఘం సభ్యులు, మహిళలు, మెడికల్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకం

సురవరం విజయలక్ష్మి

నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నాచారం (ప్రశ్న న్యూస్) మహిళా శక్తి అనంతమని, ఇల్లాలుగా, తల్లిగా, సోదరిగా, భార్యగా కుటుంబాన్ని అంటిపెట్టుకుని ఉండడమే కాక, విద్య, ఉద్యోగ, రాజకీయ, అంతరిక్ష రంగాలలోను మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావడం గొప్ప విషయమని ఏఐటియూసి జాతీయ కార్యదర్శి సురవరం విజయలక్ష్మి అన్నారు. నాచారంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో మంగళవారం నాడు (10 మార్చి 2026) తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఎచ్-1725) ఈఎస్ఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సురవరం విజయలక్ష్మి మాట్లాడుతు చరిత్రలో ఎంతో మంది మహిళలు హక్కుల సాధనలో అనేక కష్టాలను ఎదురించి పోరాడరని, నేటికీ మహిళలు సమానత్వం, భద్రత కోసం పోరాడుతునే ఉన్నారని అన్నారు. లింగ వివక్షను అంతం చేసి, స్త్రీ, పురుషులిద్దరు సమానం అనే భావన మరింత బలపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. రమేష్ బాబు మాట్లాడుతు మహిళా సాధికారత కోసం మహిళలకు అవకాశాలు ఇవ్వడమే కాక వారి నిర్ణయాలను గౌరవించడం ద్వారా వారిని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని, పక్షులు కూడా ఒక రెక్కతో ఎగరలేవని, సమాజం బాగుపడాలంటే స్త్రీ, పురుషులిద్దరు సమానత్వంతో ముందడుగు వేయడం ఎంతో అవసరమని ఉద్గాటించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల హక్కుల్ని తెలుసుకుంటు, మన కలలను నిజం చేసుకోవడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ-1 డాక్టర్. వీణారాణి, టిజిడిఏ. ప్రధాన కార్యదర్శి. డాక్టర్ సతీష్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్లు (గ్రేడ్-1) ప్రీతి, గ్రేస్ కార్బెట్, టిఎన్‌జిఓ, ఐఎంఎఫ్ ఫోరమ్ ప్రసిడెంట్. శ్రీనయ్య, తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యనిర్వహక అధ్యక్షులు వి. వేణు కుమార్, యూనియన్ కేంద్ర సభ్యురాలు ఎస్.ప్రేమలత, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.ప్రేమలత, ఈఎస్ఐ నాచారం శాఖ అధ్యక్షురాలు జి.విక్టోరియా, అరుణ, భాగ్య, చంద్రకళ, భాగ్య, సౌందర్య, అంజని, చాముండేశ్వరి, నర్సింగ్ రావు, పి.ఎన్ శ్రీనివాస్, కే. రాఘవేందర్ రావు మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవ స్థాపకురాలు కార్ల జట్కిన్ కు నివాళులు అర్పించారు. అలాగే ఈరోజు మృతి చెందిన నర్సింగ్ ఆఫీసర్ జ్యోతి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

బీజేపీ నిర్లక్ష్యంతో ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం సంస్థ దెబ్బతింటోంది

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

మంథని (ప్రశ్న న్యూస్) పెద్దపల్లిని యోజకవర్గంలోని ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం సంస్థను సరైన నిర్వహణ లేకుండా నడుపుతున్నారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలో జరుగుతున్న మిస్ మేనేజ్మెంట్, నిర్లక్ష్యంపై కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా కి పలుమార్లు లేఖలు రాసినట్లు తెలిపారు. వ్యక్తిగతంగా కూడా కలసి సమస్యలను వివరించినప్పటికీ సరైన స్పందన రాలేదని అన్నారు.ప్రస్తుతం ఆర్ఎఫ్‌సీఎల్ రామగుండం సంస్థలో ఉత్పత్తి సామర్థ్యం పూర్తిగా వినియోగించుకోవడం లేదని, కేవలం సుమారు 70 శాతం మాత్రమే ప్రొడక్షన్ కొనసాగుతోందని పేర్కొన్నారు సంస్థ హెడ్ ఆఫీస్ ప్రస్తుతం ఢిల్లీలో ఉండటం వల్ల ఇక్కడి సమస్యలపై తగిన శ్రద్ధ లేకపోతుందని, అందువల్ల హెడ్ ఆఫీస్‌ను హైదరాబాద్‌కు మార్చాలని కూడా పలుమార్లు లేఖలు, విజ్ఞప్తులు చేసినట్లు తెలిపారు.అయితే కేంద్ర ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించలేదని, హెడ్ ఆఫీస్‌ను మార్చే అవకాశం లేదని అధికారికంగా లేఖ ద్వారా తెలియజేసినట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల సంస్థ నిర్వహణపై మరింత ప్రభావం పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో మూతపడిన ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థను తిరిగి ప్రారంభించేందుకు మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి , కాకా కలిసి అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ తో చర్చలు జరిపి కృషి చేశారని గుర్తు చేశారు అనంతరం వివేక్ ఎంపీగా ఉన్న సమయంలో కూడా ఎంతో శ్రమించి సంస్థను మళ్లీ ప్రొడక్షన్‌లోకి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా అనేక మంది స్థానిక యువతకు ఉపాధి లభించిందని చెప్పారు.రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ ద్వారా తెలంగాణకు యూరియా సరఫరా జరగడంతో పాటు, దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఎరువులు పంపిణీ అయ్యే విధంగా వ్యవస్థ పనిచేసిందని వివరించారు. అయితే ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వంలో యూరియా నిర్వహణలో గందరగోళం నెలకొన్నదని, సరైన విధంగా ఇంపోర్టులు చేయకపోవడం, ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఈ పరిస్థితి తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని, దీనిపై నిరసన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

సావిత్రిబాయి పూలే ఆశయాలు సమాజానికి స్ఫూర్తి దాయకం

కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,మల్కాపూర్ మాజీ సర్పంచ్ : కోరెపు నరేష్

బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా నివాళులు సామాజిక సంస్కరణల కోసం జీవితాన్ని అంకితం చేసి మహిళా విద్యకు మార్గదర్శకురాలిగా నిలిచిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బోయినిపల్లి మండల నాయకులు, మల్కాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కోరెపు నరేష్ ఆమెకు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు విద్యను అందించి సమాజంలో సమానత్వం నెలకొల్పేందుకు సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహిళల సాధికారత, విద్యా ప్రాధాన్యత గురించి ఆమె చూపిన దారి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను అందరూ ఆచరణలో పెట్టాలని కోరెపు నరేష్ పిలుపునిచ్చారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

ఎండి యూనస్ ఖాన్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండలం పరిధిలోని మంగళవారం నాడు కొల్చారం మసీద్ లో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేసిన కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎండి యునాస్ ఖాన్ ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్న కొల్చారం మండలం వివిధ గ్రామాల ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఎండి యూనస్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు, మత సామరస్యానికి సోదర భావానికి ప్రతికగా నిలిచే ఈ ఇఫ్తార్ విందులో ఆత్మీయంగా పాల్గొనడం చాలా సంతోషకరం ఉందన్నారు ఈ ఇఫ్తార్ విందులో పాల్గొని విజయవంతం చేసిన మండల ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన ఎండి యునాస్ ఖాన్.

ప్రజల విశ్వాసం మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ గా చంటి లత

- జేజే నర్సయ్య పదవీ బాధ్యతలు హర్షణీయం
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఎమ్మార్పీఎస్ నేత : తెడ్డు అశోక్ మాదిగ
- భీంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ దంపతులకు ఘన సన్మానం

భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గం, భీంగల్ మున్సిపల్ కౌన్సిలర్ గా ప్రజల ఆశీర్వాదంతో అఖండ విజయం సాధించి, భీంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన చంటి లత -- నర్సయ్య (జేజే) దంపతులను సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తెడ్డు వార్డెన్ గంగారాం,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెడ్డు అశోక్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తెడ్డు అశోక్ మాట్లాడుతూ, ప్రజల విశ్వాసంతో బాధ్యతలు చేపట్టిన చంటి లత -- నర్సయ్య దంపతులు ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. భీంగల్ పట్టణ అభివృద్ధికి వారు కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలని కోరుతూ వారికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెడ్డు అశోక్ తోపాటుగా మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిహెచ్ గంగాధర్, కాంతయ్య, గడల ప్రసాద్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కనుమరుగవుతున్న బీటీ రోడ్లు

– కాంక్రీట్ సామ్రాజ్యం వెనుక నిజం ఏమిటి.?

– సీసీ రోడ్ల నిర్మాణం.. ఖర్చుల రాజకీయాలు

– భూగర్భ జలాల భవిష్యత్తు అగమ్యగోచరం

– ప్రజల ప్రయోజనాల కంటే కాంట్రాక్టర్ల లాభాలే పెద్దవా.?

మౌలిక వసతుల అభివృద్ధి పేరిట వేగంగా పెరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం, నీటి ఇంకుదలపై ప్రభావం? పట్టణ ప్రణాళికలో కొత్త చర్చ. ఐటీ, రియల్ ఎస్టేట్ బూమ్‌తో నగర సరిహద్దులు వేగంగా పెరుగుతున్న వేళ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు ఒకవైపు – ట్రాఫిక్, కాలుష్యం, పర్యావరణ నష్టం మరోవైపు.

(గౌటీ బాల సాయి తిలక్ – ప్రశ్న న్యూస్)

దేశంలోని ప్రధాన నగరాల్లో రహదారి నిర్మాణ విధానంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పుడు ఎక్కువగా కనిపించే బీటీ (బిటుమెన్) రోడ్లు ఇప్పుడు క్రమంగా తగ్గిపోతూ, వాటి స్థానంలో సీసీ (సిమెంట్ కాంక్రీట్) రోడ్లు పెరుగుతున్నాయి. ప్రత్యేకంగా హైదరాబాద్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సీసీ రోడ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. మున్సిపల్ సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థలు ఎక్కువగా సీసీ రోడ్ల నిర్మాణానికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే ఈ మార్పు పట్ల పర్యావరణ నిపుణులు, పట్టణ ప్రణాళికకర్తలు, ఇంజనీరింగ్ వర్గాల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీసీ రోడ్లు నిజంగా దీర్ఘకాలిక పరిష్కారమా? లేక పట్టణాల్లో నీటి సమస్యలకు కారణమవుతున్నాయా? అనే ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.

- నగర రహదారుల రూపం మారుతోంది

ఒకప్పుడు హైదరాబాద్‌లో వర్షం పడితే నల్లటి బీటీ రోడ్లపై నీరు జారిపడేది. ఇప్పుడు అదే నగరంలో తెల్లటి కాంక్రీట్ రోడ్లే కనిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా నగరంలో ఎక్కడ చూసినా సీసీ (సిమెంట్ కాంక్రీట్) రోడ్లే వేస్తున్నారు. కాలనీలు, ప్రధాన రహదారులు, వీధులు – అన్నిచోట్లా ఇదే ధోరణి. పట్టణ అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ మార్పు నిజంగా ప్రజల ప్రయోజనాల కోసమేనా? లేక ఖర్చులు పెంచి కాంట్రాక్టర్లకు, అధికారులకు లాభాలు చేకూర్చే కొత్త వ్యూహమా?ఈ ప్రశ్న ఇప్పుడు సామాన్య ప్రజల్లో కూడా చర్చకు వస్తోంది. ఎందుకంటే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది---బీటీ (బిటుమెన్) రోడ్లు వేయడం క్రమంగా తగ్గిపోతుంది. వాటి స్థానంలో భారీ ఖర్చుతో కూడిన సీసీ రోడ్లు పెరుగుతున్నాయి.

- బీటీ రోడ్లు - ఒకప్పుడు నగరాల ప్రధాన రహదారులు

బీటీ రోడ్లు అనగా బిటుమెన్‌తో నిర్మించే రహదారులు. ఇది సాధారణంగా నల్లరంగులో కనిపించే రహదారి. దశాబ్దాలుగా పట్టణాల్లో ఎక్కువగా ఈ రోడ్లే నిర్మించబడుతున్నాయి. నిర్మాణ వ్యయం తక్కువగా ఉండటం, నిర్మాణం వేగంగా పూర్తి కావడం వల్ల మున్సిపల్ సంస్థలు ఈ రహదారులను ఎక్కువగా ఉపయోగించేవి. అయితే బీటీ రోడ్లకు కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. భారీ వర్షాలు పడితే ఈ రోడ్లు దెబ్బతినే అవకాశం ఉంటుంది. అలాగే తరచుగా మరమ్మతులు చేయాల్సిన అవసరం కూడా ఉంటుంది.

- సీసీ రోడ్లు - కొత్త ధోరణి

సీసీ రోడ్లు అనగా సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించే రహదారులు. ఇవి తెల్లటి లేదా లేత బూడిద రంగులో కనిపిస్తాయి. ఈ రహదారులు బలంగా ఉండటం, ఎక్కువ కాలం నిలవడం వంటి కారణాల వల్ల ఇటీవల నగరాల్లో వీటి నిర్మాణం పెరుగుతోంది. మున్సిపల్ సంస్థలు కూడా దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

- బీటీ రోడ్లు - సీసీ రోడ్లు మధ్య వ్యత్యాసం!

బీటీ రోడ్లు అంటే బిటుమెన్ అనే పదార్థంతో తయారుచేసే రోడ్లు. వీటిని సాధారణంగా "టార్ రోడ్లు" అని కూడా అంటారు. వీటి నిర్మాణంలో ముఖ్యంగా మూడు దశలు ఉంటాయి సబ్‌గ్రేడ్ (భూమి స్థాయి), మెటల్ పొర, బిటుమెన్ పొర. ఈ రోడ్లు సులభంగా వేయవచ్చు. నిర్మాణం కూడా వేగంగా పూర్తవుతుంది. ఖర్చు కూడా తక్కువగా ఉంటుంది.

అదే సీసీ రోడ్డు అంటే "సిమెంట్ కాంక్రీట్". ఇందులో సిమెంట్, ఇసుక, జల్లులు, నీరు కలిపి కాంక్రీట్ తయారు చేసి రోడ్లు నిర్మిస్తారు. ఇవి బలంగా ఉంటాయని అధికారులు చెబుతారు. కానీ వీటి నిర్మాణం ఖరీదైనది. సమయం కూడా ఎక్కువ పడుతుంది.

- ఖర్చుల పోలిక - నిజం ఏమిటి.?

సాధారణంగా 1 కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి అయ్యే సగటు ఖర్చు బీటీ రోడ్డుకు అయితే రూ. 60 లక్షలు నుంచి రూ. 1.2 కోట్లు (వెడల్పు ఆధారంగా) ఉంటుంది, అదే సీసీ రోడ్డుకు రూ. 1.5 కోట్లు నుంచి రూ. 3 కోట్లు పై మాటే అంటే సీసీ రోడ్డు ఖర్చు బీటీ రోడ్డు కంటే సుమారు రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువ. అయితే ఇంత భారీ ఖర్చు ఉన్నప్పటికీ ఎందుకు అధికారులు సీసీ రోడ్లకే మొగ్గు చూపుతున్నారన్న ప్రశ్న ప్రజల్లో వస్తుంది.

- భూగర్భ జలాలపై ప్రభావం

నగరాల్లో ప్రస్తుతం ఎదురవుతున్న ప్రధాన సమస్యల్లో ఒకటి భూగర్భ జలాల తగ్గుదల. పచ్చని ప్రదేశాలు తగ్గిపోవడం, చెరువులు నింపివేయడం, భూమిపై కాంక్రీట్ నిర్మాణాలు పెరగడం వల్ల వర్షపు నీరు నేలలోకి ఇంకే అవకాశాలు తగ్గిపోతున్నాయి. సీసీ రోడ్లు పూర్తిగా నీరు చొరబడని విధంగా ఉంటాయి. అంటే వర్షపు నీరు నేలలోకి ఇంకే అవకాశం ఉండదు. దీని వల్ల వర్షపు నీరు డ్రైనేజీల్లోకి వెళ్తుంది, భూగర్భ జలాలు రీఛార్జ్ కావు, ఇది హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు ప్రమాదకరం. అంటే దీర్ఘకాలంలో చూస్తే సీసీ రోడ్లు భూగర్భ జలాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎక్కువగా సీసీ రోడ్లు వేయడం వల్ల భూగర్భ జలాల నిల్వ తగ్గే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- పట్టణ ప్రణాళికలో కొత్త చర్చ

సీసీ రోడ్ల నిర్మాణంపై పట్టణ ప్రణాళిక నిపుణులు కొత్త చర్చను ప్రారంభించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసే ప్రత్యేక రహదారి నిర్మాణ విధానాలను అనుసరించాలని వారు సూచిస్తున్నారు. పెర్మియబుల్ పేవ్‌మెంట్ వంటి సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తే నీటి ఇంకుదల సమస్యను కొంతవరకు పరిష్కరించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- ఇంజనీరింగ్ నిర్ణయాలపై ప్రశ్నలు

కొంతమంది నిపుణులు పట్టణాల్లో సీసీ రోడ్ల నిర్మాణం అధికంగా జరగడంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. స్థానిక భౌగోళిక పరిస్థితులు, వర్షపాతం, నీటి పారుదల వ్యవస్థ వంటి అంశాలను పరిశీలించకుండా ఒకే విధమైన రహదారి నిర్మాణాన్ని అమలు చేయడం సరైన విధానం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. ఇంజనీరింగ్ ప్రణాళికలో సమగ్ర అధ్యయనం అవసరమని సూచిస్తున్నారు.

- సీసీ రోడ్ల నిర్మాణం - ఇది పూర్తిగా కాంట్రాక్టర్ల లాభాల కథ

నిర్మాణ రంగాన్ని దగ్గరగా చూసిన వారు చెబుతున్న మాటలు ఆందోళన కలిగిస్తున్నాయి. సీసీ రోడ్లలో మెటీరియల్ ఖర్చు ఎక్కువ, యంత్రాలు ఎక్కువ, కాంట్రాక్టు విలువ పెద్దది, అంటే కాంట్రాక్టర్లకు లాభాలు కూడా ఎక్కువ అన్నమాట. కొంతమంది నిపుణుల అభిప్రాయం ప్రకారం పెద్ద ప్రాజెక్టులలో కమీషన్లు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అదే బీటీ రోడ్ల విషయానికి వస్తే సీసీ రోడ్లతో పోల్చితే ఖర్చు తక్కువ, పనులు చిన్నవిగా ఉంటాయి, అంటే దానితో లాభాలు కూడా తక్కువే అందుకే అధికారులు, కాంట్రాక్టర్లు బీటీ రోడ్లు వేయడంలో పెద్దగా ఆసక్తి చుపించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- కాలనీల్లో పరిస్థితి - నగర ఉష్ణోగ్రతలపై ప్రభావం

హైదరాబాద్‌లో చాలా కాలనీల్లో ఇప్పుడు పాత బీటీ రోడ్లు తీసేసి వాటి స్థానంలో సీసీ రోడ్లు వేస్తున్నారు, కానీ దీనివల్ల సమస్య వస్తోంది. రోడ్ల ఎత్తు పెరుగుతోంది. ఇళ్ల గుమ్మాల కంటే రోడ్లు ఎత్తుగా మారుతున్నాయి.

దీంతో వర్షం కాలంలో వర్షం పడితే నీరు ఇళ్లలోకి చేరుతుంది, ఇది నగరంలో అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్న సమస్య. సీసీ రోడ్లు సూర్యకిరణాలను ఎక్కువగా ప్రతిబింబిస్తాయి. కాంక్రీట్ ఉపరితలం వేడిని నిల్వ చేస్తుంది అది అందరికి విదితమే, దీని వల్ల నగర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. "హీట్ ఐలాండ్ ఎఫెక్ట్" పెరుగుతుంది. ఇది ఇప్పటికే హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు పెద్ద సమస్యగా మారుతోంది.

- ప్రజల ప్రశ్న - నిపుణుల సూచనలు

ప్రతి కాలనిల్లో సీసీ రోడ్లు వేయడం మొదలు పెట్టిన ప్రభుత్వాన్ని ఇప్పుడు ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు ఏంటంటే నిజంగా సీసీ రోడ్లే ఉత్తమమా?, లేక ఖర్చులు పెంచే కొత్త మోడలా?, పర్యావరణాన్ని ఎవరు కాపాడాలి?, భూగర్భ జలాల భవిష్యత్తు ఏమిటి.? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇంకా రావడం లేదు.పట్టణ ప్రణాళిక నిపుణులు చేస్తున్న కొన్ని సూచనల ప్రకారం అన్ని రోడ్లు సీసీ చేయకూడదు, నీరు నేలలోకి వెళ్లే పర్మియబుల్ రోడ్లను ప్రోత్సహించాలి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలి, పర్యావరణ ప్రభావం అంచనా వేయాలి. హైదరాబాద్ ఒక వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరం. కానీ అభివృద్ధి అంటే కేవలం కాంక్రీట్ కాదు. నగరానికి అవసరమైన సమతుల్య ప్రణాళిక, పర్యావరణ పరిరక్షణ, ప్రజల సౌకర్యం, మూడు అంశాలు సమానంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

-చివరిగా..

సీసీ రోడ్లు నిజంగా అభివృద్ధి చిహ్నమా? లేక కాంట్రాక్టర్లకు లాభాల బాటమా? నగర ప్రజలు సమాధానం కోరుతున్నారు. అభివృద్ధి పేరుతో తీసుకునే ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుంది. అందుకే పారదర్శకత, బాధ్యత, ప్రజా ప్రయోజనం అవసరం, లేకపోతే భవిష్యత్తులో హైదరాబాద్ కాంక్రీట్ అడవిగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మొత్తానికి నగర అభివృద్ధి కోసం మౌలిక వసతుల అభివృద్ధి అవసరం.

అయితే రహదారి నిర్మాణంలో పర్యావరణ అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవడం అత్యంత ముఖ్యం. సీసీ రోడ్లు దీర్ఘకాలికంగా ఉపయోగకరమైనవైనా, వాటి ప్రభావం భూగర్భ జలాలపై ఎలా ఉంటుందో పరిశీలించడం అవసరం. భవిష్యత్తులో పట్టణ ప్రణాళికలో సాంకేతికతను ఉపయోగించి పర్యావరణానికి అనుకూలమైన రహదారి నిర్మాణ విధానాలను అనుసరించడం అవసరం.

పెరుగుతున్న అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు

– ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌కు ట్రంప్ వార్నింగ్

న్యూయార్క్ (ప్రశ్న న్యూస్) అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎంపికైన మొజ్తబా ఖమేనీని లక్ష్యంగా చేసుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "అతను ప్రశాంతంగా జీవించగలడని నేను అనుకోవడం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి తర్వాత ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీని కొత్త అధినేతగా ఎన్నుకున్నారు. ఈ నిర్ణయంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇరాన్ ఈ నాయకుడిని ఎన్నుకోవడంపై నేను సంతోషంగా లేను. అతను ప్రశాంతంగా బతకలేడు" అని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ నియామక ప్రక్రియలో వెనెజువెలా తరహాలోనే తన ప్రమేయం కలిగి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, ఖమేనీ విధానాలు గత పాలకుల మాదిరే కొనసాగితే ఐదేళ్లలో మరో యుద్ధం తప్పదని ట్రంప్ హెచ్చరించారు. "ఆ పదవిలో కొనసాగాలంటే అతను మా అనుమతి తీసుకోవాలి. లేకపోతే ఎక్కువ కాలం ఉండలేడు" అని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'

– 208 మంది అరెస్ట్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సైబర్ మోసగాళ్లకు సహకరిస్తున్న వారిపై రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో ఫిబ్రవరి 25న ప్రారంభించిన ఈ రాష్ట్రవ్యాప్త ఆపరేషన్‌లో భాగంగా 208 మందిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం తెలిపారు. నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఏడుగురు విద్యార్థులు, 15 మంది మహిళలు, ఇద్దరు లెక్చరర్లు, విద్యుత్ శాఖ ఉద్యోగి కూడా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాలకు సంబంధించిన నగదు బదిలీలకు ఉపయోగించే 'మ్యూల్ ఖాతాల'పై ఈ ఆపరేషన్ కేంద్రీకరించింది. నిందితులు 5 శాతం వరకు కమీషన్ తీసుకుని తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటాను విశ్లేషించిన టీజీసీఎస్‌బీ, తెలంగాణలో తెరిచిన అనుమానాస్పద ఖాతాలను గుర్తించింది.ఈ ఆపరేషన్‌లో భాగంగా 512 మంది సిబ్బందితో కూడిన 137 పోలీస్ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా 137 బ్యాంకు బ్రాంచ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా 9,451 కేసులతో సంబంధం ఉన్న 1,888 మ్యూల్ ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా సుమారు రూ.100 కోట్ల మోసం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అరెస్టయిన వారిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జూబ్లీహిల్స్ మర్చంట్ కో–ఆపరేటివ్ బ్యాంకులకు చెందిన ఇద్దరు ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరు సరైన కేవైసీ నిబంధనలు పాటించకుండా ఖాతాలు తెరిచేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 63 మొబైల్ ఫోన్లు, 208 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్ బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌లో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల ఖాతాలను కూడా మోసాలకు వాడినట్లు తేలింది. కొందరు నిందితులు నకిలీ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఖాతాలు తెరిచి మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ

– లోక్‌సభలో ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. "ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు.అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు. అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

ఆగని పెట్రోల్ మాఫియా ఆగడాలు

పత్రికలో కథనాలు వచ్చినా డోంట్ కేర్

అధికారుల కన్నుసైగల్లోనే దందా

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పెట్రోల్ మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఘట్కేసర్, మేడిపల్లి, చర్లపల్లి, మల్లాపూర్ ప్రాంతాల్లో పలు పత్రికల్లో పదేపదే కథనాలు వెలువడుతున్నప్పటికీ పెట్రోల్ మాఫియా మాత్రం ఏమాత్రం భయపడకుండా యథేచ్ఛగా తమ దందాను కొనసాగిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, కొందరి రిపోర్టర్ల కన్నుసైగలే ఈ అక్రమ వ్యాపారానికి అండగా మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయం,రాత్రి వేళల్లో పెట్రోల్ ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుని మాఫియా సభ్యులు దందాకు తెరలేపుతున్నారు. ట్యాంకర్ల నుంచి అక్రమంగా పెట్రోల్ తీసి దాచిపెట్టి, తరువాత దాన్ని తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఘట్కేసర్, మేడిపల్లి, చర్లపల్లి, మల్లాపూర్ ప్రాంతాలలో ఈ అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం జరుగుతుండగా ఆ ప్రాంతంలో భద్రతా సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. పెట్రోల్ వంటి అతి ప్రమాదకర పదార్థాన్ని ఇలా బహిరంగంగా తీయడం, తరలించడం వల్ల ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ విషయాలపై సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

అధికారుల మౌనం వెనుక అంతర్యమేమిటి.?

ప్రాంత ప్రజలు పలుమార్లు పోలీసులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం కనిపించలేదని అంటున్నారు. ఇదంతా చూస్తుంటే కొందరు అధికారులే మాఫియాకు అండగా నిలుస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. (ప్రభుత్వం కఠినంగా స్పందించి ఈ పెట్రోల్ మాఫియాపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా పెట్రోల్ తీస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఇప్పటికైన అధికారులు మేల్కొని చర్యలు తీసుకుంటారా.? లేదా మాఫియా ఆగడాలు ఇలాగే కొనసాగుతాయా.? అన్నది ఇప్పుడు ప్రజల్లో పెద్ద ప్రశ్నగా మారింది.

ప్రజాప్రశ్న
స్థానిక రిపోర్టర్ల కనుసైగల్లో పెట్రోల్ మాఫియా

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588